



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 102 | మంగళవారం 16 సెప్టెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

### ఇంజనీరింగ్ రంగంలో
## చెరగని ముద్ర వేసిన విశ్వేశ్వరయ్య

**- మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా నివాళులర్పించిన ప్రధాని మోడీ**



**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15**

ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ప్రధాని మోడీ ఆయనకు నివాళులర్పించారు. 'ఈరోజు ఇంజనీరింగ్స్ డే. ఈ సందర్భంగా నేను మోక్షగుండం విశ్వేశ్వర్యకు నివాళు లర్పిస్తున్నాను. ఆయన ప్రతిభ ఇంజనీరింగ్ రంగంలో చెరగని

- మిగతా 2లో..

### ఇజ్రాయిల్ దాడులకు
## 25 మంది పాలస్తీనియన్లు మృతి



**గాజా – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15**

సోమవారం ఉదయం ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడిలో ఆరేళ్ల కవలపిల్లలతో సహా 25 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. ఇక నిన్న నివాస భవనాలపై జరిపిన బాంబు దాడిలో కనీసం 16 బహుళ అంతస్తుల భవనాలు విధ్వంసమయ్యాయి. ఈ దాడి వల్ల 53 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. కాగా, అక్టోబర్ 7 2023 నుండి ప్రారంభమైన

- మిగతా 2లో..



## రాజకీయ పార్టీలు 'పని ప్రదేశాలు' కావు..

**- లైంగిక వేధింపుల చట్టం వర్తించదు : సుప్రీంకోర్టు**
**- రాజకీయ పార్టీలను పోష్ చట్టం పరిధిలోకి తెచ్చే పిటిషన్ తిరస్కరణ - పార్టీలకు, కార్యకర్తలకు మధ్య యజమాని-ఉద్యోగి సంబంధం ఉండదన్న సుప్రీం**
**- కేరళ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15**

రాజకీయ రంగంలో పనిచేస్తున్న మహిళలకు లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్) కింద రక్షణ కల్పించాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. రాజకీయ పార్టీలకు, కార్యకర్తలకు మధ్య యజమాని–ఉద్యోగి సంబంధం ఉండదని, కాబట్టి రాజకీయ పార్టీలను 'పని ప్రదేశం'గా పరిగణించజాలమని సోమవారం స్పష్టం చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ

- మిగతా 2లో..

### వీధి దీపాల నిర్వహణ
## బాధ్యత సర్పంచులకే..

**- అన్ని ఎల్ఈడీ లైట్లను సీసీసీకి అనుసంధానించండి**
**-వాటి ఏర్పాటుకు కొత్తగా టెండర్లు పిలవాలి**
**- ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15**

ఎల్ఈడీ వీధి దీపాలపై రాష్ట్రమంతటా పక్కాగా పర్యవేక్షణ ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, వాటి నిర్వహణ బాధ్యతలను సర్పంచులకే అప్పగించాలని సూచించారు. గ్రామాల్లో అవసరమైనన్ని కొత్త ఎల్ఈడీ లైట్లను అమర్చటంతో పాటు వాటిని సమర్థంగా నిర్వహించే నిర్వహణ అధికారం గ్రామ పంచాయతీల పరిధిలోనే ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(సీసీసీ)లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జీహెచ్ఎంసీ అధికారులతో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎల్ఈడీ లైట్లు వెలుగుతున్నాయా? లేదా? లేకపోతే కొత్తగా ఎన్ని అవసర మున్నాయో పక్కాగా అంచనా వేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ప్రతీ పోల్‌నూ సర్వే చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. రాత్రి పూట ఎల్ఈడీ లైట్లు పని చేయటంతో పాటు పగటిపూట దుర్వినియోగం కాకుండా ఉండేందుకు పక్కాగా పర్యవేక్షణ చేయాలనీ, అన్ని గ్రామాల ఎల్ఈడీ డ్యాష్ బోర్డులను మండల స్థాయిలో ఎంపీడీవో పర్యవేక్షించాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో అడిషనల్ కలెక్టర్‌కు ఈ బాధ్యతలు అప్పగించాలన్నారు.

- మిగతా 2లో..




### దేశం గర్వించదగ్గ నిపుణుడు
## మోక్షగుండం విశ్వేశ్వరయ్య

**- మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడిన జగన్**
**- ఇంజినీర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన జగన్**

**అమరావతి– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15**

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఇంజినీర్లకు 'ఇంజినీర్స్ డే' శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ఒక సందేశాన్ని పోస్ట్ చేశారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను జగన్ స్మరించుకున్నారు.

- మిగతా 2లో..



### సాంకేతికతతో పాటే
## నియంత్రణ పరుగెత్తాలి

**- నిర్మల సీతారామన్ స్పష్టత**
**- వేగంగా విస్తరిస్తున్న కృత్రిమ మేధ**
**- ఆవిష్కరణలను అడ్డుకోని రీతిలో నిబంధనలు ఉండాలని స్పష్టీకరణ - ఏఐలో భారత్ నాయకత్వ పాత్ర పోషించడమే లక్ష్యమన్న కేంద్ర మంత్రి**
**- ఉద్యోగాలపై ఏఐ ప్రభావాన్ని జాగ్రత్తగా అంచనా వేయాలని సూచన - నీతి ఆయోగ్ నివేదిక విడుదల కార్యక్రమంలో మంత్రి కీలక వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15**

కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ – ఏఐ) సాంకేతికత ఒక స్ప్రింటర్ వలె వేగంగా పరుగెడుతోందని, దానికి అనుగుణంగా నియంత్రణ వ్యవస్థ కూడా అంతే వేగంతో కదలాల్సి ఉంటుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.

2లో

### ఉద్యానవన పంటల
## విస్తీర్ణాన్ని పెంచాలి

**- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**
**- ఉద్యాన పంటల విస్తీర్ణతను పెంచడానికి ప్రణాళికతో ముందుకు వెళ్తాం**
**- కలెక్టర్ల సదస్సులో అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15:**

అన్నమయ్య జిల్లాలో ఉద్యానవన పంటల విస్తీర్ణాన్ని పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు 04వ కలెక్టర్ల సదస్సులో పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి

- మిగతా 2లో..



### ఎన్నికల సంఘం ప్రధాని నియంత్రణలో
## పనిచేస్తోంది

**- ఈసీ పూర్తిగా బీజేపీ ఎన్నికల ఏజెంట్‌గా మారిపోయిందని వైఎస్ షర్మిల తీవ్ర ఆరోపణ**
**- కర్ణాటక, మహారాష్ట్రలలో జరిగిన ఓట్ల అవకతవకలను ప్రస్తావించిన షర్మిల**
**- దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం - రాష్ట్రంలో నేటి నుంచి అక్టోబర్ 15 వరకు సంతకాల సేకరణ**

**అమరావతి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15**

కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) పనితీరుపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సంచలన ఆరోపణలు చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతిలో బందీగా

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# ఉద్యానవన పంటల విస్తీర్ణాన్ని పెంచాలి



(మొదటిపేజీ తరువాయి)

నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలో జరుగుతున్న నాలుగవ కలెక్టర్ల సదస్సులో అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అన్నమయ్య జిల్లాలో వ్యవసాయ ఆధారిత రైతుల ఎక్కువగా ఉన్నారని వర్షపాతం తక్కువగా ఉండటం వల్ల ఈ సంవత్సరం సాగు తక్కువగా ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అన్నమయ్య జిల్లాను ఉద్దేశించి మాట్లాడుతూ... అన్నమయ్య జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్.. ఉద్యానవన పంటల విస్తీర్ణతను పెంచడానికి ప్రణాళికతో ముందుకు వెళ్తామని తెలిపారు.

## ఇజ్రాయిల్ దాడులకు 25 మంది పాలస్తీనియన్లు మృతి

(మొదటిపేజీ తరువాయి)

దాడుల వల్ల 64,871 మంది మృతి చెందారు. 164,610 మంది గాయాలపాలయ్యారు. ఇదిలా ఉండగా.. ఐక్యరాజ్యసమితితో సహా పలు దేశాలు ఇజ్రాయిల్.. పాలస్తీనాపై దాడుల్ని ఆపాలని పిలుపునిచ్చాయి. అయిన ప్పటికీ ఇజ్రాయిల్ దాడుల్ని కొనసాగిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయిల్‌తో సంబంధాలు తెంచుకోవాలని ముస్లిం దేశాలను ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ కోరారు.

## ఇంజనీరింగ్ రంగంలో చెరగని ముద్ర వేసిన విశ్వేశ్వరయ్య

(మొదటిపేజీ తరువాయి)

ముద్ర వేసింది. తమ సృజనాత్మకత, దృఢ సంకల్పం ద్వారా వివిధ రంగాలలో ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్తూ కఠినమైన సవాళ్లను ఎదుర్కొంటూ కొనసాగుతున్న ఇంజనీర్లందరికీ నేను హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. వికసిత్ భారత్‌ను నిర్మించడానికి సమిష్టి ప్రయత్నాలతో భారతీయ ఇంజనీర్లు కీలకపాత్ర పోషిస్తూనే ఉంటారు' అని మోడీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, సెప్టెంబర్ 15 మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి. ఈరోజునే ప్రతి సంవత్సరం ఇంజనీరింగ్స్ డేగా జరుపుకుంటారు.

## యూరియా వాడకంతో క్యాన్సర్ ముప్పు

- యూరియా అతివాడకంతో క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నాయన్న సీఎం చంద్రబాబు
- ఏపీలో టాప్-5 వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటిగా ఉందని వెల్లడి
- ఇదే పరిస్థితి కొనసాగితే క్యాన్సర్‌లో నంబర్-1 అవుతామని ఆందోళన
- వచ్చే ఏడాది నుంచి అవసరమైన మేరకే యూరియా వినియోగం
- రైతులకు మైక్రో న్యూట్రియంట్స్‌ను సప్లిమెంట్లుగా ఇవ్వాలని సూచన
- యూరియా దుష్ప్రభావాలపై పంజాబ్‌ను కేస్ స్టడీగా తీసుకోవాలన్న సీఎం

**అమరావతి– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15**



వ్యవసాయంలో యూరియాను విచ్చలవిడిగా వాడటం వల్ల ప్రాణాంతక క్యాన్సర్ మహమ్మారి బారిన పడే ప్రమాదం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే క్యాన్సర్ కేసులు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయని, యూరియా వాడకాన్ని నియంత్రించకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు తప్పవని ఆయన హెచ్చరించారు. కలెక్టర్ల సదస్సులో వ్యవసాయ రంగంపై జరిగిన సమీక్షలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం క్యాన్సర్ అత్యంత ప్రమాదకరమైన టాప్–5 వ్యాధుల్లో ఒకటిగా ఉందని ఆయన గుర్తుచేశారు. రైతులు అధిక దిగుబడి వస్తుందనే అపోహతో యూరియాను పరిమితికి మించి వాడుతున్నారని, ఈ ధోరణి ఇలాగే కొనసాగితే క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్యలో రాష్ట్రం దేశంలోనే నంబర్–1 స్థానానికి చేరుకునే ప్రమాదం ఉందని అన్నారు. ఈ ప్రమాదాన్ని నివారించేందుకు యూరియా వాడకంపై రైతుల్లో విస్తృత చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. వచ్చే ఏడాది నుంచి పంటలకు ఎంత అవసరమో అంతే పరిమాణంలో యూరియాను వినియోగించేలా చూడాలన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా సూక్ష్మ పోషకాలను (మైక్రో న్యూట్రియంట్స్) రైతులకు సప్లిమెంట్ల రూపంలో అందించాలని స్పష్టం చేశారు. యూరియా ఎక్కువగా వాడితే అధిక పంట దిగుబడి వస్తుందనుకోవడం కేవలం అపోహ మాత్రమేనని చంద్రబాబు అన్నారు. యూరియా అతివాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలను అర్థం చేసుకోవడానికి పంజాబ్ రాష్ట్రాన్ని ఒక కేస్ స్టడీగా తీసుకోవాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# సాంకేతికతతో పాటే నియంత్రణ పరుగెత్తాలి

(మొదటిపేజీ తరువాయి)

నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూనే నైతిక విలువలను విస్మరించకుండా బాధ్యతాయుతమైన వినియోగాన్ని నిర్ధారించాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. సోమవారం ఢిల్లీలో నీతి ఆయోగ్ రూపొందించిన "వికసిత భారత్ కోసం ఏఐ: ఆర్థిక వృద్ధికి అవకాశాలు" అనే నివేదికను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కృత్రిమ మేధ నిరంతరం అభివృద్ధి చెందుతున్న సాంకేతికత అని, దాని విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "సాంకేతికతను పూర్తిగా తుడిచిపెట్టేలా నియంత్రణ ఉండకూడదు. బాధ్యతాయుతమైన వినియోగాన్ని ప్రోత్సహించేందుకే మాకు నిబంధనలు అవసరం" అని ఆమె వివరించారు.

ఏఐ రంగంలో ప్రపంచ పరిణామాలకు అనుగుణంగా వెళ్లడమే కాకుండా ఈ సాంకేతికత వినియోగంలో భారత్ నాయకత్వ పాత్ర పోషించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ దిశగా నాస్కామ్ వంటి భాగస్వామ్య పక్షాలతో ప్రభుత్వం నిరంతరం చర్చిస్తోందని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా విద్య, వ్యవసాయం, ఆరోగ్యం, పట్టణ మౌలిక సదుపాయాల వంటి రంగాల్లో ప్రత్యేక ఏఐ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు గుర్తుచేశారు. మెరుగైన నగరాలు, జీవన ప్రమాణాల కోసం ఏఐ పరిష్కారాలను అందించాలని ఆమె ఆకాంక్షించారు. అదే సమయంలో ఏఐ వల్ల ఎదురయ్యే సవాళ్ల పట్ల కూడా మంత్రి హెచ్చరించారు. ముఖ్యంగా ఉద్యోగాలపై దాని ప్రభావాన్ని జాగ్రత్తగా గమనించాలని, దేశ జనాభా ప్రయోజనానికి ఎలాంటి నష్టం కలగకుండా చూసుకోవాలని అన్నారు. వివిధ ఏఐ అప్లికేషన్లను పరీక్షించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఒక ప్రత్యేక శాండ్‌బాక్స్‌ను అభివృద్ధి చేస్తోందని ఆమె వెల్లడించారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందని, అయితే ఆ ప్రయాణం బాధ్యతాయుతంగా సాగాలని ఆమె పునరుద్ఘాటించారు.

# వీధి దీపాల నిర్వహణ బాధ్యత సర్పంచులకే..

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలోని అన్ని గ్రామాల పరిధిలో 16.16 లక్షల ఎల్‌ఈడీ లైట్లున్నాయని, వరంగల్, నల్గొండ, జనగాం, నారాయణపేట జిల్లాల్లో ఎల్‌ఈడీ లైట్ల కాంట్రాక్టు ఏజెన్సీ అధ్వర్యంలో ఉందని అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. అన్ని గ్రామాల్లో సర్పంచులకే వీటిని అప్పగిస్తే.. లైట్ల నిర్వహణ, విద్యుత్తు దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట పడుతుందనే అభిప్రాయాలు సమావేశంలో వ్యక్తమయ్యాయి. కాగా జీహెచ్‌ఎంసీ పరిధిలో 5.50 లక్షల ఎల్‌ఈడీ లైట్లు ఉన్నాయని, అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ సిటీని కూడా కలిపితే మొత్తం 7.50 లక్షల లైట్లు అవసరమవుతాయని మున్సిపల్ శాఖ సీఎంకు నివేదించింది. గతంలో ఉన్న ఏజెన్సీ కాంట్రాక్టు ముగియటంతో ఇప్పుడు చాలాచోట్ల లైట్లు వెలగటం లేదని, నిర్వహణ కూడా సరిగా జరగలేదని అధికారులు తెలిపారు. కోర్ అర్బన్ సిటీ పరిధిలో జీహెచ్‌ఎంసీతో పాటు కొత్తగా చేరిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఎల్‌ఈడీ లైట్ల అవసరాన్ని అంచనా వేయాలని సీఎం వారిని ఆదేశించారు. ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు, నిర్వహణకు కొత్తగా టెండర్లు పిలవాలని కోరారు. వాటి తయారీలో పేరొందిన కంపెనీలను ఆహ్వానించాలనీ, ఏడేండ్ల పాటు నిర్వహణ బాధ్యతలు వాటికే అప్పగించాలని సూచించారు. నిర్వహణ పక్కగా ఉండేందుకు వీలుగా టెండర్ నిబంధనలను రూపొందించుకోవాలని ఆదేశించారు. ఎల్‌ఈడీ లైట్లతో పాటు కంట్రోల్ బాక్స్ ల ఏర్పాటు, నిరంతరం అవి పనిచేస్తున్నాయా? లేదా? ఏయే ప్రాంతాల్లో ఇబ్బందులున్నాయో తెలుసుకునేందుకు ప్రత్యేకంగా వ్యవస్థ ఉండాలని సీఎం అన్నారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్ ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సూచించారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ పరిధిలో వీధి దీపాలకు ప్రతి నెలా రూ.8 కోట్ల కరెంటు బిల్లు చెల్లించాల్సి వస్తోందనీ, విద్యుత్తును ఆదా చేసేందుకు వీలుగా సోలార్ పవర్‌ను వినియోగించే అంశాన్ని, అందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. కోర్ అర్బన్ సిటీ ఏరియాతో పాటు ఔటర్ అవతల ఉన్న మున్సిపాలిటీల్లోనూ ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ మున్సిపాలిటీలతో పాటు కొన్ని మున్సిపాలిటీల్లో కొత్త గ్రామాల విలీనం, గ్రామాల మార్పులు చేర్పులు జరిగాయని అన్నారు. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఎల్‌ఈడీ లైట్ల అవసరాన్ని అంచనా వేయాలని సూచించారు. కోర్ అర్బన్ సిటీతో పాటు మున్సిపాలిటీల్లో ఎల్‌ఈడీ లైట్లకు కూడా టెండర్లు పిలవాలని ఆయన ఆదేశించారు. సమీక్షా సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయితీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, కోర్ అర్బన్ ఏరియా మున్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ శ్రీజన పాల్గొన్నారు.

## దేశం గర్వించదగ్గ నిపుణుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య

(మొదటిపేజీ తరువాయి)

"దేశం గర్వించదగ్గ ఇంజినీరింగ్ నిపుణులు, ఎన్నో తాగు, సాగునీటి ప్రాజెక్టుల రూపశిల్పి భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారు. దేశానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. విశ్వేశ్వరయ్య గారి జయంతి సందర్భంగా ఇంజనీర్లందరికీ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు" అని తన పోస్టులో పేర్కొన్నారు. భారతదేశపు గొప్ప ఇంజినీరింగ్ మేధావిగా పేరుగాంచిన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య పుట్టినరోజైన సెప్టెంబర్ 15వ తేదీని ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా 'ఇంజనీర్స్ డే'గా జరుపుకోవడం ఆనవాయతీగా వస్తోంది. ఈ సందర్భంగా దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్రను పలువురు గుర్తుచేసుకుంటున్నారు.

## రాజకీయ పార్టీలు 'పని ప్రదేశాలు' కావు..

(మొదటిపేజీ తరువాయి)

పిటిషన్‌ను విచారించింది. రాజకీయ పార్టీలను 'పోష్' చట్టంలోని 'పని ప్రదేశం' నిర్వచనం కిందకు ఎలా తీసుకురాగలమని ధర్మాసనం ప్రశ్నించింది. పార్టీకి, దాని కార్యకర్తలకు మధ్య యజమాని–ఉద్యోగి బంధం లేనప్పుడు, ఈ చట్టం వర్తింపజేయడం సాధ్యం కాదని అభిప్రాయపడింది. అడ్వకేట్ యోగమాయ ఎం.జి. ఈ స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. 2022 మార్చిలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆమె ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. యజమాని–ఉద్యోగి సంబంధం లేనందున, రాజకీయ పార్టీలు అంతర్గత ఫిర్యాదుల కమిటీలను (ఐసీసీ) ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని అప్పట్లో కేరళ హైకోర్టు తీర్పు ఇచ్చింది. కేరళ హైకోర్టు తీర్పు వల్ల రాజకీయ, సినీ, మీడియా వంటి అనధికారిక రంగాలలో పనిచేస్తున్న ఎంతో మంది మహిళలు పోష్ చట్టం రక్షణకు దూరమవుతున్నారని పిటిషనర్ వాదించారు. 'యజమాని', 'ఉద్యోగి', 'పని ప్రదేశం' వంటి పదాలకు చట్టంలో విస్తృత అర్థం ఉందని, కానీ హైకోర్టు తీర్పు దాని స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉందని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 19(1)(జి), 21 కింద కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని పిటిషన్‌లో ఆరోపించారు. గత నెలలో కూడా ఇదే తరహా ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సీజేఐ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనమే తిరస్కరించింది. అయితే, కేరళ హైకోర్టు తీర్పును ప్రత్యేకంగా ఎస్ఎల్‌పీ ద్వారా సవాలు చేయవచ్చని అప్పుడు సూచించింది. కాగా, గతేడాది డిసెంబర్‌లో ఇలాంటి మరో పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, ఈ విషయంలో ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించడం గమనార్హం.

## .ఎన్నికల సంఘం ప్రధాని నియంత్రణలో పనిచేస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

మారిందని, బీజేపీకి ఎన్నికల ఏజెంట్‌గా పనిచేస్తోందని ఆమె తీవ్రంగా విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం ప్రజలంతా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.

ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన ఈసీ, పూర్తిగా బీజేపీ ప్రయోజనాల కోసం పనిచేస్తోందని షర్మిల ఆరోపించారు. కేవలం ఎన్నికల సంఘమే కాకుండా సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ ప్రధాని మోదీ గుప్పిట్లో ఉన్నాయని, ఆయన ఆదేశాల మేరకే పనిచేస్తున్నాయని విమర్శించారు. ఈ వాస్తవాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ ప్రజల ముందు ఉంచారని, ఇది నేటి భారత ప్రజాస్వామ్య దుస్థితికి నిదర్శనమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, దేశంలో జరుగుతున్న ఓట్ల అవకతవకలకు సంబంధించి కొన్ని ఉదాహరణలను ఆమె ప్రస్తావించారు. కర్ణాటకలోని మహాదేవపుర నియోజకవర్గంలో ఏకంగా లక్ష దొంగ ఓట్లను నమోదు చేశారని, అవన్నీ నకిలీ ఫోటోలు, పేర్లు, చిరునామాలతో సృష్టించినవేనని ఆమె ఆరోపించారు. అదేవిధంగా, మహారాష్ట్ర ఎన్నికల సమయంలో పోలింగ్ చివరి గంటలో, అంటే సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య, అనూహ్యంగా 60 లక్షలకు పైగా ఓట్లు పోల్ అయ్యాయని, ఆ ఓట్లు ఎవరు వేశారో చెప్పడానికి ఈసీ వద్ద ఎలాంటి ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ లేదని ఆమె దుయ్యబట్టారు. ఎన్నికలకు కేవలం ఐదు నెలల ముందు కోటికి పైగా కొత్త ఓట్లు నమోదు కావడం వెనుక పెద్ద కుట్ర ఉందని షర్మిల అనుమానం వ్యక్తం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తూ, వారికి అనుకూలంగా దొంగ ఓట్లను చేర్చడం ద్వారా ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు. ఈ ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త పోరాటానికి సిద్ధమైందని తెలిపారు. ఈ పోరాటంలో భాగంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు ప్రకటించారు. సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలందరూ ఇందులో పాల్గొని తమ మద్దతు తెలియజేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## పలువురు ఐఎఎస్‌ల బదిలీ

### - రతన్ టాటా ఇన్నోవేషన్ సిఇఒగా ధాత్రిరెడ్డి

**అమరావతి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15**

రాష్ట్రంలో పలువురు ఐఎఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు జిఓఆర్‌టి నెంబరు 1696ను సోమవారం విడుదల చేసింది. ఏలూరు జాయింట్ కలెక్టరు పి ధాత్రిరెడ్డిని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సిఇఒగా బదిలీ చేశారు. కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టరు గీతాంజలి శర్మను ఎపి స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ ఎమ్‌డిగా, పాడేరు సబ్‌కలెక్టరు శౌర్యమన్ పటేల్‌ను ఆర్‌టిజిఎస్ అడిషనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా నియమంచారు. అలాగే, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఐపిఎస్ రాహుల్ దేవ్ శర్మకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డైరెక్టర్, ఎపిఎస్‌బిసిఎల్ ఎమ్‌డిగా అదనపు బాధ్యతలతోపాటు డిస్టిలరీస్ అండ్ బ్రేవరీస్ కమిషనర్‌గా పూర్తి బాధ్యతలను అప్పగిస్తూ ఎక్సైజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా జిఓ జారీ చేశారు.

# స్థానిక సంస్థల
# ఎన్నికల సందడి షురూ

**విజయవాడ – సూర్య వాస్తవం**



ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి ప్రారంభం అయింది. పాలకవర్గాల పదవీకాలం ముగియడానికి మూడు నెలల ముందే ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. మొత్తం నాలుగు విడతల్లో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని వచ్చే ఏడాది మార్చిలో పదవీ విరమణ చేయనున్నారు. ఈ లోపే స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిచేసి పదవీ విరమణ చేయాలన్న ఆలోచనతో ఉన్నారు. అయితే అధికార పార్టీలో సన్నాహాలు ప్రారంభం అయ్యాయి కానీ.. ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి కదలిక లేదు. కేంద్ర బలగాల సాయంతోనే ఎన్నికలు నిర్వహిస్తేనే అన్నమాట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వినిపిస్తోంది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలను ఎలా తీసుకుంటుందో అర్థమవుతోంది. గత అనుభవాల దృష్ట్యా స్థానిక సంస్థల విషయంలో జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎన్నో రకాల ట్విస్టులు కొనసాగాయి. చంద్రబాబు హయాంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా నియమితులయ్యారు నిమ్మగడ్డ రమేష్ కుమార్. అదే సమయంలో కరోనా వచ్చింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో తన ఆదేశాలు పాటించలేదని.. నిమ్మగడ్డ రమేష్ కుమార్ చంద్రబాబు మనిషి అంటూ తప్పించే ప్రయత్నం చేశారు జగన్మోహన్ రెడ్డి. కానీ చివరకు కోర్టు ఆదేశాలతో నియమితులయ్యారు నిమ్మగడ్డ. ఆయన కమిషనర్ గా ఉండగానే స్థానిక సంస్థలు ఎన్నికలు జరిగాయి. అయితే ఇప్పుడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా నీలం సాహ్ని ఉన్నారు. ఆమె జగన్ హయాంలో నియమితులయ్యారు. కానీ ఇప్పుడు ఆమె ఎన్నికల నిర్వహణకు ప్రతిపాదనలు పెడితే ప్రభుత్వం నుంచి ఆమోదముద్ర వచ్చింది. ఇప్పటికే ఆమె నేతృత్వంలో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పిటిసి ఎన్నికలు జరిగాయి. ఆమెపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి రకరకాల ఒత్తిడిలు వెళ్లాయి. కానీ ఆమె పెద్దగా చలించలేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఏ స్థాయిలో? ఎలా జరుగుతాయో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అర్థమయింది. అందుకే ఎన్నికలను బహిష్కరించేందుకు ఆ పార్టీ ఇప్పటినుంచే కారణాలను వెతుక్కుంటుందివైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఇప్పుడే ఆ పార్టీలో ఆశావహులు ముందుకు వచ్చే అవకాశం లేదు. కనీసం పార్టీ పిలుపు ఇస్తున్న కార్యక్రమాలకు సైతం పార్టీ శ్రేణులు హాజరవుతున్న దాఖలాలు లేవు. పులివెందులతో పాటు ఒంటిమిట్టలో వచ్చిన ఫలితం పార్టీ శ్రేణులకు తీవ్ర కలవరపాటుకు గురిచేసింది. గతంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంతో పాటు జాతీయస్థాయిలో అధికారంలో ఉన్నప్పుడే.. ఉప ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. అటువంటిది ఇప్పుడు ఈ రెండు జెడ్పిటిసి ఎన్నికల్లో ఓడిపోవడం అనేది ఆ పార్టీకి చాలా నష్టమే. పార్టీలో ఒక అపనమ్మకాన్ని, నైరశ్యాన్ని అలుముకునేలా చేసింది ఈ ఫలితం. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలను బాయ్ కట్ చేసేందుకు నిర్ణయించుకున్నట్లు సమాచారం. దానికి కారణాలు చెప్పుకునేందుకే.. కేంద్ర బలగాలతో ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్. అయితే స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారిక నోటిఫికేషన్ వచ్చిన తర్వాత.. ఒక పద్ధతి ప్రకారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన నిర్ణయాన్ని వెల్లడించే అవకాశాలు కనిపిస్తున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో?

## పోరాటాలకు సిద్ధమౌతున్న వైసీపీ

**విజయవాడ – సూర్య వాస్తవం**



ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కొత్త పోరాటాలకు సిద్ధం అవుతోంది.ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడాన్ని తప్పుపడుతూ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టడానికి రెడీ అవుతోంది. ఈ విషయంలో ఇతర రాజకీయ పక్షాల సహకారం తీసుకోవాలని జగన్మోహన్ రెడ్డి నిర్ణయించారు. రాజకీయ పార్టీలతో పాటు ప్రజా సంఘాలు తమతో కలిసి రావాలని కోరారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటు జరిగిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడికక్కడే పునాదుల స్థాయిలో ఉన్న భవనాలను చూపించి.. ఇదేనా మెడికల్ కాలేజీలు అంటూ టిడిపి ప్రశ్నిస్తోంది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మాత్రం నేతలు పెద్దగా మాట్లాడడం లేదు. ఒకరిద్దరు తప్పిస్తే గట్టిగా రిప్లై ఇవ్వలేకపోతున్నారు. దీనిపై విమర్శలు రావడంతో అధినేత జగన్మోహన్ రెడ్డి సీరియస్ అయినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే మాజీ మంత్రి రోజా ఈ అంశంపై మాట్లాడడం విశేషం. కొద్దిరోజులుగా రోజా కనిపించడం లేదు. ఆమె అరెస్టు ఉంటుందని అంతటా ప్రచారం జరిగింది. వైసిపి హయాంలో ఆమె క్రీడల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించారు. ఆ సమయంలో భారీ అవినీతి జరిగిందన్నది కూటమి ప్రభుత్వ ఆరోపణ. దీనిపై విజిలెన్స్ విచారణ కూడా ప్రారంభం అయింది. పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టాయని విజిలెన్స్ విచారణలో తేలింది. ఈ క్రమంలో అప్పటి మంత్రిగా వ్యవహరించిన రోజాతో పాటు శాప్ చైర్మన్గా ఉన్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కి సైతం ఈ కుంభకోణంలో హస్తం ఉందని విజిలెన్స్ విచారణలో తేలినట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ లో ఖచ్చితంగా మాజీ మంత్రి రోజా అరెస్టు జరుగుతుందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అప్పటినుంచి రోజా సైతం వ్యూహాత్మకంగా సైలెంట్ అయ్యారు. అయితే ఇప్పుడు మెడికల్ కాలేజీల విషయంలో ఏకంగా హోంమంత్రి వంగలపూడి అనిత పై విరుచుకుపడ్డారు రోజా. తద్వారా తన అరెస్టు విషయంలో భయపడడం లేదని తెలుస్తోంది. తనను అరెస్టు చేస్తే సానుభూతి వర్కౌట్ అవుతుందని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. అందుకే గట్టి వాయిస్ తోనే రోజా ఇప్పుడు ముందుకు వచ్చారు.జగన్మోహన్ రెడ్డిక్యాబినెట్లో మంత్రిగా వ్యవహరించారు రోజా. ఆమె క్రీడల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో 2024 డిసెంబర్లో ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడా పోటీలు నిర్వహించారు. అయితే అప్పట్లో ఆ క్రీడా పోటీలపై అనేక రకాల విమర్శలు వచ్చాయి. వాలంటీర్లే ఎంపైర్లుగా మారగా.. వైసీపీ సానుభూతిపరులతో క్రీడా పోటీలు నిర్వహించి పెద్ద ఎత్తున నిధులను పక్కదారి పట్టించారన్న విమర్శ ఉంది. నాసిరకం క్రీడా పరికరాలను అందించి భారీగా నిధులు గోల్మాల్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. అయితే దీనిపై అన్ని జిల్లాల నుంచి విజిలెన్స్ విచారణ జరిగింది. మాజీ మంత్రి రోజాతో పాటు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని అరెస్టు చేస్తారని టాక్ నడిచింది. అయితే కొన్ని రోజులపాటు రోజా సైలెంట్ గా ఉన్నారు. అయితే ఇప్పుడు ఉన్నఫలంగా మీడియా ముందుకు వచ్చి ఏకంగా వంగలపూడి అనితకు సవాల్ చేశారు. మెడికల్ కాలేజీలపై అనిత తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. తనతో వస్తే పాడేరు మెడికల్ కాలేజీని చూపిస్తానంటూ సవాల్ చేశారు. మొత్తానికి అయితే కూటమి కేసుల విషయంలో డోంట్ కేర్ అన్నట్టు రోజా వ్యవహార శైలి ఉంది. మరి కూటమి నుంచి ఎలాంటి రిప్లై ఉంటుందో చూడాలి.



# వైద్యం.. దోపిడీ..!

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ వైద్యులు
- చదివింది హోమియోపతి... చూసేది అల్లోపతి ...
- వైద్య పరీక్షల పేరిట దోచుకుంటున్న ల్యాబ్‌లు
- రిఫరల్‌తో డాక్టర్లకు కమీషన్లు
- పట్టించుకోని అధికారులు

**అనంతపురం జిల్లాలో కొందరు డాక్టర్లు విలువలకు తిలోదకాలు ఇవ్వడం వల్ల మొత్తం వైద్య వృత్తికే మచ్చగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి....ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. హద్దు మీరి కొందరు స్పెషలిస్ట్ డాక్టర్‌లా చలామణి అవుతూ అర్హతకు మించి వైద్యం చేస్తున్నారు. గ్రామీణ ప్రజలకు ప్రాథమిక సేవలు మాత్రమే చికిత్సలు చేయాలి. అర్హతకు మించి చిన్న పిల్లలకు వైద్యం కూడా చేస్తున్నారు. వచ్చిన రోగులకు ప్రథమ చికిత్స చేసి దగ్గరలోని ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రికి సిఫారసు చేయాలి. ఎంతో నమ్మకంతో వచ్చిన రోగులను వారి బలహీనతను ఆసరా చేసుకుని అందిన కాడికి దోచుకుంటూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు**

**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం**

జాబుల్లో బెస్ట్ జాబ్ ఆర్ఎంపి జాబ్. తమకు తెలిసింది గోరంత చేసేది కొండంత.తాము చేయాల్సింది కేవలం ప్రాథమిక చికిత్స కానీ వీళ్ళు చేసేది కాన్పులు, సిజేరియన్, శస్త్ర చికిత్సలు ప్రమాదకరమైన ఆపరేషన్లు. జిల్లాలో హోమియో వైద్యులు గత దశాబ్ద కాలంగా ఏకంగా అల్లోపతి క్లినిక్ నడుపుతున్నారు. గుత్తి, పామిడి, నార్పల, ధర్మవరం, ఉరవకొండ, తాడిపత్రి, గుంతకల్లు ప్రాంతాలల్లో ఖరీదైన ఆసుపత్రులు నెలకొల్పారు. ఇందులో కాన్పులు సిజేరియాన్ ఆపరేషన్లు చేసేది. బిహెచ్ఎంఎస్ డాక్టర్లు. మారుమూల ప్రాంతాల గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువ శాతం ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రయివేటు నర్సింగ్ హోమ్స్ కు వెళ్లలేక అంతో ఇంతో సమర్పించుకొని వీరి బారిన పడుతుంటారు. వీళ్లు చదివింది హోమియోపతి చేసేది అల్లోపతి వీళ్లు చదివిన కోర్సు పట్ల వీరికే నమ్మకం లేదు, ప్రభుత్వాన్ని నమ్మకం కలిగించమంటారు. అవసరం లేని మందులు రాస్తూ, తమ దగ్గర లక్షల్లో మందులు అమ్ముతూ పేదల నుండి డబ్బు గుంజుతున్నారు. ఈ దోపిడీ ఎప్పుడైనా బయటపడుతుందేమో అని మరోవైపు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అంటూ కార్లకు పెద్ద బోర్డులు పెట్టుకొని ఊరేగుతున్న జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదు. మరో వైపు ఇంకొందరు స్వచ్ఛంధ సేవ సంస్థల ముసుగులో ఒక దిక్కుమాలిన ఆసుపత్రి లేదా ధార్మిక సంస్థ ద్వారా రెండు నెలలకొకసారి వంద మంది రోగులకు కంటి ఆపరేషన్లు చేయిస్తూ ఇంతకు మించి సేవ ఎవడూ చేయలేదని పత్రికల్లో ప్రకటనలు ఇస్తుంటారు. జిల్లా పాలనాధికారులు వైద్యాధికారులు కళ్ళు మూసుకుంటే వాళ్ళు మొత్తం వైద్య వ్యవస్థనే తారుమారు చేస్తారు. వర్షాకాలం మొదలై రెండు నెలలవుతుంది, సీజన్ మొదలవకముందే జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు వైద్యులు. అనంతపురం లోని అన్ని మండలాల్లో గ్రామీణ వైద్యులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద రోగులు పెద్ద ఎత్తున గుమికూడు తున్నారు. వర్షాకాలంలో ప్రధానంగా ఐదు రకాల వైరల్ ఫీవర్లు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జూన్ నుంచి డిసెంబర్ వరకు ఈ సీజనల్ వ్యాధులు ఇబ్బంది పెడుతూనే ఉంటాయి. ప్రజలు బయట తిండిమాని ఇంటి తిండి వేడిగా తింటే సగం జబ్బులనుండి దూరంగా ఉండవచ్చు. జిల్లాలలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పరిస్థితి భయంకరంగా తయారయ్యింది. జిల్లా కేంద్రంలో వెలసిన సర్వజన ఆసుపత్రిలో గైనిక్ వార్డుల్లో ప్రతి మంచానికి ఇద్దరు గర్భిణీలు, ఇద్దరు బాలింతలు ఉంటున్నారు. పేద ఇంటి ఆడబిడ్డలు గర్భవతులు కావడం శాపంగా మారింది. గైనిక్ వార్డ్ సందర్శకులు తాకిడితో కిటకిట లాడుతున్నది. అడ్మిషన్ అయిన గర్భవతులు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే పేద ప్రజలు, వారిలో చాలామందికి రక్తహీనత ఉంటున్నది. సిజరిన్ చేయడానికి వీరికి కావలసిన రక్తం కొన్ని సందర్భాలలో అందుబాటులో ఉండటం లేదు. రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ లో లేదా ప్రైవేటు బ్లడ్ బ్యాంక్ లో డబ్బు పెట్టి తెచ్చుకోవాల్సిందే, ప్రైవేటు బ్లడ్ బ్యాంక్ కొన్ని చోట్ల లేవు. రక్త కొరత ఎక్కువగా ఉంటున్నది. చాలా జిల్లాలలో కిడ్నీ , లివర్ సోరియాసిస్ సంబంధిత వ్యాధులకు డైయాలసిస్ సౌకర్యం లేదు. ఇక కాన్సర్ లాంటి భయానక వ్యాధులకు కీమోథెరపీ లేకపోవడంతో రోగులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ప్రాణాంతక తలసేమియా, ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులను పట్టించుకునే దిక్కే లేదు. మారుమూల గ్రామాలల్లో మండలాల్లో ఆరోగ్యం పడకేసింది. ఈ మధ్య కాలంలో ఆర్ఎంపి లు చేయని వైద్యమంటూ లేదు. ప్రతి ఆర్ఎంపీ ఒక ఆపరేషన్ థియేటర్ ఉంటుంది. బయట బోర్డు పై ఫస్ట్ ఎయిడ్ సెంటర్ అని ఉంటుంది కానీ సాధారణ జ్వరం నుండి మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, కరోనా కు చికిత్స చేస్తున్నారు. గర్భవతులకు కాన్పులు, సిస్ట్, హైసెక్టమీ, పైల్స్, హైడ్రోసిల్ ఆపరేషన్లు, కంటి శస్త్ర చికిత్సలు చేస్తున్న జిల్లా వైద్యాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుంటారు. హోమియోపతి, ఆయుర్వేదిక్, యునాని చదివిన డాక్టర్లు సైతం అల్లోపతి వైద్యం చేస్తుంటారు, హోమియోపతి, ఆయుర్వేదం, యునాని చేసిన డాక్టర్లు పాలీ క్లినిక్, నర్సింగ్ హోమ్ నిర్వహిస్తూ పెద్ద ఎత్తున సిజేరియన్, శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. వీళ్ళు నిర్వహిస్తున్న పాలీ క్లినిక్ లో పేర్లు ఎండి, ఎంఎస్ చేసిన డాక్టర్ల పేర్లు ఉంటాయి. ఎక్కడో సుదూర ప్రాంతాల్లో పనిచేసే డాక్టర్లు పేర్లు ఇక్కడి ప్రైవేటు ఆసుపత్రిలో దర్శనమిస్తుంటాయి. ఆర్ఎంపి లేదా పిఎంపి కావడానికి, ఒక వ్యక్తి మూడు సంవత్సరాల పాటు రిజిస్టర్డ్ డాక్టర్ వద్ద ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది. మరియు దాని ముగింపులో, అభ్యాసం డాక్టర్ చే గుర్తింపు పొందింది. వైద్యుని సంతకం మరియు రిజిస్ట్రేషన్ నంబర్‌తో కూడిన డాక్యుమెంట్‌ను పారా మెడికల్ బోర్డుకు తీసుకువెళతారు, అక్కడ వారు కమ్యూనిటీ పారా మెడికల్ మెంబర్‌గా నమోదు చేయబడతారు. క్లినిక్, హాస్పిటల్ లేదా నర్సింగ్ హోమ్, ఒకరికి ఎంబిబిఎస్ డిగ్రీ సర్టిఫికేట్ అవసరం, మెడికల్ బోర్డ్‌లో రిజిస్టర్ అయి ఉండాలి మరియు డిఎంహెచ్వో వద్ద వారి స్థాపనను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. కొందరు ఇంట్లోనే హాస్పిటల్ తెరిచి, ఐసీయూ నిర్వహణ, మెడికల్ షాప్ తెరచి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుకున్నారు. చిన్న చిన్న వాటికి ప్రథమ చికిత్స చేసి పెద్దాసుపత్రులకు పంపాల్సింది పోయి, తామే మల్టీ స్పెషాలిటీ తరహాలో ఆసుపత్రి దుకాణాన్ని తెరిచి అక్కడికి డాక్టర్లను రప్పించుకుంటున్నారు. ప్రథమ చికిత్స చేయాల్సిన వీరు శస్త్రచికిత్సలు చేస్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న, జిల్లా వైద్యాధికారులు చలనం లేదు. ఈ నేపథ్యంలో తనిఖీలు నిర్వహించి ఆర్ఎంపి క్లినిక్, పాలి క్లినిక్ 24 గంటలు క్లినిక్స్ లో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో బోర్డులో కనపరచిన డాక్టర్లు లేని యెడల హాస్పిటల్ సీజ్ చేయాలి. డాక్టర్లు లేకుండా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. పిహెచ్‌సి అధికారులు గ్రామీణ మరియు ఆర్ఎంపి లను చేసుకోని, ఇన్‌పేషెంట్ క్లినిక్‌లు మరియు ఆసుపత్రులను నడుపుతున్న వ్యక్తుల జాబితాను తయారు చేయాలి. . కొందరు ఆర్ఎంపీఎస్, పీఎంపీలు ‘డాక్టర్’ అనే బిరుదును ఉపయోగించుకుని తమకు అనుమతి లేని వైద్యం అందించి రోగిని మోసం చేస్తున్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం-2010 ప్రకారం, ఆర్ఎంపి పిఎంపి లు తమను తాము వైద్యులు అని పిలవకూడదని ప్రథమ చికిత్స కేంద్రాలుగా బోర్డులను ప్రదర్శించాలని స్టాండింగ్ సూచనలు చెబుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులకు ఈ విషయాలన్నీ తెలిసినా, వారూ అపుడపుడు తనిఖీలు నిర్వహించి ‘మమా’ అనిపించేస్తున్నారు...

**వైద్య పరీక్షల పేరిట దోచుకుంటున్న ల్యాబ్‌లు..?**

**అనంతపురం లోనీ కొన్ని ల్యాబులు, ఎక్స్‌రే, స్కానింగ్ సెంటర్లు నిబంధనలను పాటించడం లేదు. కనీసం ధరల సూచిక పట్టికలు ఉండటం లేదు. అనధికారికంగా కేంద్రాలను నడుపుతూ రోగుల వద్ద నుంచి లక్షల్లో దోచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలు చిన్నపాటి జ్వరం, జలుబుతో ప్రైవేట్ క్లినిక్‌కు వెళితే పరీక్షల పేరుతో రోగుల జేబులు గుల్ల చేస్తున్నారు. ప్రైవేట్ క్లినిక్‌లకు అనుబంధంగా ల్యాబ్‌లు ఉంటున్నాయనేది, రిఫరల్ డాక్టర్లకు కమీషన్లు అందుతున్నా యన్నది జగమెరిగిన సత్యం....**

# ప్రతి మంగళవారం పరిశ్రమల రోజు

**- పరిశ్రమల శాఖ కార్యదర్శి సూచన**

**అమరావతి– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15**

రాష్ట్రంలో పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు ఇకపై ప్రతి మంగళవారాన్ని పరిశ్రమల రోజుగా నిర్వహించా లని పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్ కలెక్టర్లకు సూచిరచారు. కలెక్టర్ల సదస్సు సందర్భంగా పరిశ్రమల శాఖపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ గ్రీవియెన్స్ డే తరహాలోనే పరిశ్రమల రోజును కూడా నిర్వహించాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే సంస్థలు, వ్యక్తులతో స్వయంగా సంప్రదింపులు జరపాలని కలెక్టర్లకు సూచిరచారు. పరిశ్రమలు ఏర్పాటుచేసేరదుకు ప్రధానంగా భూమి అవసరమని, అందువల్ల భూసేరణపై కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ భూమి లభ్యం కాని ప్రారతాల్లో ల్యాండ్ పూలింగ్ ద్వారా భూసేకరణ చేయాలని సూచించారు.

**జగ్గయ్యపేటలో మిస్సైల్ క్లస్టర్**

గతేడాది జూన్ నురచి ఇప్పవరకు రాష్ట్రంలో పది లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఆమోదం లభిరచినట్లు యువరాజ్ పేర్కొన్నారు. ప్రస్తుతం 30 క్లస్టర్లలో, రానున్న రోజుల్లో మరో 20 క్లస్టర్లలో లక్ష ఎకరాల ఖాళీ స్థలాన్ని గుర్తిరచినట్లు చెప్పారు. విశాఖ, శ్రీకాకుళర జిల్లాల మధ్య మూడు వేల ఎకరాల్లో నావల్ క్లస్టర్, మరో ఐదు చోట్ల డిఫెన్స్ క్లస్టర్లు, జగ్గయ్యపేటలో మూడు ఎకరాల స్థలంలో మిస్సైల్, ఆయుధాల క్లస్టర్లు, ఓర్వకల్లులో అన్‌మాన్డ్ సిస్టమ్ క్లస్టర్, అనంతపురం జిల్లా మడకశిర, లేపాక్షి మధ్యలో ఐదు వేల ఎకరాల్లో ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్ క్లస్టర్, ప్రకాశం జిల్లాలోని దొనకొరడలో నాలుగు వేల ఎకరాల్లో ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాల క్లస్టర్ రాబోతున్నాయని వివరిరచారు.

## జిల్లా పోలీస్ గ్రీవెన్స్‌కు 121 వినతులు




**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15:** జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నాడు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం)" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ నిర్వహించారు.ప్రజల సమస్యలను నేరుగా విని, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించారు.కుటుంబ కలహాలు, అత్తారింటి వేదింపులు, రస్తా తగాదాలు, తదితర సమస్యలపై ఫిర్యాదులు అందచేశారు.ఎస్పీ ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, చట్టపరిదిలో "సత్వర న్యాయం అందించాలి - ఆలస్యం చేయరాదు" అని ఆదేశించారు.చట్టపరమైన చర్యలు తీసుకున్న వెంటనే వివరాలతో కూడిన నివేదికలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని సూచించారు జిల్లా ఎస్పీ. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు డీసీఆర్బీ సి.ఐ హరినాథ్ పాల్గొన్నారు.

## సదస్సుకు హాజరైన అనంత కలెక్టర్ ఆనంద్



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15:** సచివాలయంలోని ఐదో బ్లాకులో సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్ నేడు తొలి రోజున వివిధ అంశాలపై జిల్లాల్లో ప్రగతి, సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్షించడంతో పాటు... కేటగిరీల వారీగా శాఖలపై సీఎం సమీక్షిస్తున్న నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొనగా అనంతపురము జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ సదరు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఏపీలో 15శాతం వృద్ధిరేటు సాధనే లక్ష్యంగా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేస్తున్న సీఎం - కలెక్టర్ల సదస్సులో ఇవాళ నాలుగు అంశాలపై చర్చ - 8 కేటగిరీల్లో వివిధ ప్రభుత్వ శాఖలపై, జీఎస్డీపీ, సంక్షేమం, పీ-4, సూపర్ సిక్స్ అమలు వంటి అంశాలపై సమీక్ష. లాజిస్టిక్స్, ఇన్ఫ్రా, స్వచ్ఛాంధ్ర, సర్కులర్ ఎకానమీపై కలెక్టర్ల కాన్ఫరెన్సులో తొలి రోజు చర్చ. జిల్లా కలెక్టర్ల సదస్సులో రేపు నాలుగు అంశాలపై చర్చలు-మానవ వనరుల అభివృద్ధి, వైద్యారోగ్య, విద్య, నైపుణ్యాభివృద్ధిపై చర్చ-ఐటీ, క్వాంటం, ఆర్టీఐహెచ్, వాట్సప్ సేవలు,డేటాలేక్, ఏఐపై చర్చ-రెవెన్యూ భూములు, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, రవాణా పై చర్- శాంతి భద్రతలు, ప్రభుత్వ సేవలు తదితరాలపై చర్చ జరిగింది.

### జిల్లాకు స్మార్ట్ రైస్ కార్డులు

## ప్రభుత్వం నుంచి సరఫరా

### - జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15 :** జిల్లాకు కొత్తగా 6,57,248 క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులు ప్రభుత్వం నుంచి సరఫరా చేయడం జరిగిందని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. సోమవారం అనంతపురం నగరం లోని అశోక్ నగర్‌లో సచివాలయ ఉద్యోగుల ద్వారా కార్డుదారుల ఇంటి వద్దనే వారికి సంబం ధించిన క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులను జాయింట్ కలెక్టర్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ జిల్లాలోని అన్ని మండలాల్లో ఈరోజు ప్రారంభ మైందన్నారు. స్మార్ట్ రైస్ కార్డులను సంబంధిత గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా కార్డుదారుల ఇంటి వద్దనే పంపిణీ చేయడం జరుగు తుందన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేయాలని అర్బన్ తహసీల్దార్, సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్లను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. స్మార్ట్ రైస్ కార్డులను కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ వెంకటేశ్వర్లు, అర్బన్ తహసీల్దార్ హరికుమార్, సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ భాష, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ




**కణేకల్- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15 :** రాష్ట్ర ప్రభుత్వం రేషన్ వినియోగదారులకు మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం తహసీల్దార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం నిర్వహిం చడమైనది. కనేకల్ మండల కేంద్రంలోని షాప్ నెంబర్ 42లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ లాలెప్ప, చెరువు సంఘము అధ్యక్షులు రమేష్, సొసైటీ అధ్యక్షులు చంద్రశేఖర్ గుప్తా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చాంద్ బాషా, హాస్పిటల్ కమిటీ సభ్యులు కురుబ నాగరాజు, టౌన్ కన్వీనర్ అనిల్ చౌదరి, తెలుగు యువత అధ్యక్షులు ముజ్జు, తిప్పేస్వామి, తదితరులు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మండలంకు 19270 స్మార్ట్ రేషన్ కార్డు లను అందజేసిందని తెలిపారు, ఈ కార్యక్రమం లో డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాధ్, ఆర్ ఐ సందీప్, వీఆర్వో పవన్, రుద్ర, అంజలీ, డీలర్ , మహిళ పోలీస్ రాజేశ్వరి, కార్డుదారులు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో

## టమోటా ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలన

- టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణంలో నాణ్యత లేదు
- అనాలోచన విధానంతో కేంద్ర నిధులు వృధా అయ్యే అవకాశం
- పత్తికొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15:** పత్తికొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పత్తికొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అడ్వకేట్ క్రాంతి నాయుడు పత్తికొండ నియోజకవర్గ పరిధిలో ఇంటిగ్రేటెడ్ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులు ఎలా జరుగుతున్నాయి అని కమిటీ ఆధ్వర్యంలో సందర్శించి పరిశీలించారు, వారు మాట్లాడుతూ ఆరు నెలల్లో పూర్తి చేసి పంట సాగు వచ్చే సమయానికి ఉపయోగంలోకి తెస్తాం అని చెప్పి రైతులను మోసం చేశారు అని అన్నారు. నాణ్యత లేని, అనాలోచన విధానంలో ప్రభుత్వ సొమ్ము వృధా చేయకండి అని అధికారులను విన్నవించారు, మేము కష్టపడి పోరాటాలు చేసి కేంద్రం నుండి నిధులు తెస్తే రాష్ట్ర ప్రభుత్వం వారు కనీసం ఒక్క రూపాయ నిధులు కూడా ఇవ్వకుండా నిధులు వృధా చేస్తున్నారు అని విచారం వ్యక్తం చేశారు. ఇక్కడ టమోటా జ్యూస్ కి పనికి రాదు అని నాయకులు సైతం హేళన చేస్తే ప్రాసెసింగ్ చేయొచ్చు అని రిపోర్టులు ప్రభుత్వాలకు ఇచ్చి కేంద్రం నుండి నిధులు మంజూరు చేయించుకున్నాం అని అన్నారు. అలాంటి పరిశ్రమను కాలువ పక్కన, వంకల పక్కన నిర్మాణం చేస్తే ఎలా ఉంటాయి అని అడిగారు. తవుడు భూమిలో నిర్మాణాలు చేస్తే నష్టం ఎవరికి అని ప్రశ్నించారు. ఇప్పటికే పత్తికొండ లో డెబ్బై లక్షల వరకు వృధా చేశారు అని, దయచేసి ఆలోచన చేసి పూర్తి స్థాయి లో ఉపయోగపడే ప్రాజెక్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయండి అని ప్రభుత్వాన్ని కోరారు. అవకతవకలు జరిగితే సహించేది లేదు అని నెలకు ఒకసార్ సందర్శించి యూనిటీ ను పరిశీలిస్తాం అని అన్నారు.



### శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో

## ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15:** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతి సందర్భంగా ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మరియు కళాశాల అధ్యాపకులు విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.... సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశ అభివృద్ధికి చేసిన కృషి అపారమని, నదులపై ఆనకట్టలు నిర్మించి భారత ఆర్థికాభివృద్ధికి, వ్యవసాయ విస్తరణకు బలమైన పునాదులు వేశారని అన్నారు. తన మేధసక్తిని, దార్శినికతను ఉపయోగించి బీడు భూములను సస్యశ్యామలంగా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. ఇంజనీర్‌గా, దార్శనికుడిగా, విద్యావేత్తగా, పారిశ్రామిక ప్రగతి చోదకుడిగా విశ్వేశ్వరయ్య చెరగని ముద్ర వేశారని ఆయన కొనియాడారు. సెప్టెంబర్ 15న ఆయన జయంతిని పురస్కరించుకుని నిబద్ధత, సమయపాలన, అంకితభావం వంటి విలువలను ఆయన జీవితం నుండి నేర్చుకోవాలని విద్యార్థులను ప్రేరేపించారు.ఈ సందర్భంగా కళాశాలలో (కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా) స్టూడెంట్ చాప్టర్ ను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ కళ్యాణ్ సర్వేపల్లి మాట్లాడుతూ సి యస్ఐ చాప్టర్ విద్యా రంగం




మరియు పరిశ్రమలకు వారధిగా మారి సాంకేతిక పరిజ్ఞానం, నెట్వర్కింగ్, నైపుణ్యాభివృద్ధి, కెరీర్ అవకాశాల కల్పనలో కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ... సి యస్ఐ చాప్టర్ ద్వారా విద్యార్థులు వర్క్‌షాపులు, సెమినార్లు, స్టూడెంట్-ఇండస్ట్రీ లింకేజ్, ఇంటర్న్‌షిప్ అవకాశాలు వంటి అనేక విద్యా మరియు వృత్తిపరమైన ప్రయోజనాలను పొందగలరని వివరించారు.కార్యక్రమంలో అటల్ టింకరింగ్ సావనీర్ ను ఆవిష్కరించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల రియల్ టైమ్ ఎలక్ట్రానిక్ మోడల్స్‌ను ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ రూపంలో ప్రదర్శించి, వాటి పనితీరును జూనియర్ విద్యార్థులకు వివరించారు.వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకట రమణ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.

అలాగే ప్రిన్సిపల్ డాక్టర్ వీ. బాలాజీ, కళాశాల విభాగాధిపతులు, అధ్యా పకులు, విద్యార్థినీ విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా, విద్యార్థుల్లో ఇంజనీరింగ్ విలువలు, సృజనాత్మకత, సేవాభావం పెంపొందించేలా నిర్వహించబడింది.



### 17 నుండి స్వస్త్ నారి

## సశక్త్ పరివార్ అభియాన్

### - మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు

### - వైద్యధికారి డాక్టర్ గంగాధర్



**గుంతకల్- సూర్య వాస్తవం, సెప్టెంబర్15:** మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం సెప్టెంబర్ 17 తేదీ నుండి అక్టోబర్ 2 వ తేదీ వరకు పట్టణంలో "స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ " కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పిపి యూనిట్ హాస్పిటల్ వైద్యాధికారి డాక్టర్ గంగాధర్ తెలిపారు. సోమవారం భాగ్యనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా సెప్టెంబర్ 17 వ తేదీ నుండి అక్టోబర్ 2, 2వ తేదీ వరకు 2 వారాలపాటు ," స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ " "(ఆరోగ్యవంతమైన మహిళ-శక్తివంతమైన కుటుంబం)అను సమగ్ర ఆరోగ్య ప్రచార, సేవా కార్యక్రమము నిర్వహించి వలసిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబం బలపరిచే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేయడమైనది అన్నారు.ఈ కార్యక్రమం యొక్క ముఖ్య లక్ష్యాలు ఆయన వివరించారు. మహిళ ఆరోగ్యం పై అవగాహన పెంచడం, మహిళలకు సమయానుకూల వైద్య సేవలు అందించడం, పోషక ఆహారాన్ని ప్రోత్సహించడం, కుటుంబాలను స్వశక్తి, చేయడం అనగా తమ జీవనోపాధికి శక్తివంతంగా, పని చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవడానికి అందుకు దోహదం పడటం జరుగు తుందన్నారు.పట్టణ ఆరోగ్య కేంద్రం, భాగ్య నగర్, గుంతకల్లు లో, సెప్టెంబర్, 17 న ప్రత్యేక వైద్య శిబిరాలు వైద్య నిపుణులు, పారా మెడికల్ సిబ్బంది ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. వైద్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, మున్సిపల్ శాఖ, డి ఆర్ డి ఏ, మొదలగు శాఖల సమన్వయంతో ఈ బృహత్తర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ అరుణ, ఎం పి హెచ్ ఎ (ఎఫ్), వార్డు హెల్త్ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కనకదాస

## విగ్రహావిష్కరణను బహిష్కరిస్తున్నాం




**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15:** తిరుపతి పట్టణంలో రాష్ట్ర మంత్రి సవిత చౌదరి ఆధ్వర్యంలో అక్టోబర్ 5న జరిగే కనకదాస విగ్రహావిష్కరణను బహిష్కరిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా కురబ సంఘం సభ్యులు, నాయకులు తెలిపారు.

రాయచోటిలోని అజయ్ కల్యాణ మండపంలో కురబ సంఘం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కురవ, కురబ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ రానున్న మంత్రివర్గ విస్తరణలో కురబ కులం పేరు చెప్పుకుంటూ తన భర్త వెంకటేశ్వరచైదరిని పదవిని కాపాడుకునే ప్రయత్నం మంత్రి సవిత చేయడాన్ని తాము ఒప్పు కోమన్నారు. కురబలు సహకరించకపోతే సంఘం నాయకులనే మార్చేస్తామని హెచ్చరించడం తగద న్నారు. అధికారంకోసం ప్రగల్బాలు పలుకుతూ మంత్రి ఆధ్వర్యంలో జరుగుతున్న విగ్రహావిష్కరణను బహిష్కరించాలని కురబ సంఘం ఏకపక్షంగా తీర్మాని ంచిందన్నారు. అలాగే అక్టోబర్ 12న విజయ వాడలో నిర్వహించనున్న సమా వేశంలో కురబలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో పెపర్డ్ జిల్లా కురమ, కురబ, కురవ అధ్య క్షుడు, కె.రవిశంకర్, జిల్లా కురవ సంఘం అధ్యక్షుడు తరిగొండఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి కప్పల రాజన్న, జిల్లా కోశాధికారి గోవిందు సుధాకర్, గుడి రామానుజులు, గుడిశ్రీనివాసులు, గౌనుపల్లి రెడ్డన్న, మంగిరి రమణ, బోనే మురళీ కుమార్, మంగిరి సురేష్, గుడి శివ, రవీంద్ర, శ్రీనివాసులు, రవి, చెన్న కృష్ణయ్య, నాగయ్య, గోవిందు, ధనార్జన, రఘు, గిరి, మంచూరి అంజి తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో పాల్గొన్న గుమ్మనూరు ఈశ్వర్ ఎమ్మార్వో



**పామిడి -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15 :** పామిడి పట్టణంలో ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ నెహ్రూ కాలనీలోస్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమ ంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు విజనరితో ఆలోచించి స్మార్ట్ రైస్ కార్డులను ప్రవేశ పెట్టడం జరిగిందని ఇంతకుముందు గవర్నమెంట్ లో ఒకాయన బొమ్మ ఉండేదని ఇప్పుడు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అర్హుల ఫోటో తప్ప ఇంకెవరి ఫోటో కూడా రైస్ కార్డ్ మీద ఉండకూడదని ఒక మంచి సంకల్పంతో ఈ స్మార్ట్ కారులను ప్రవేశ పెట్టడం జరిగిందని ముందుచూపు ఉన్న నాయకుడి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందని మొన్ననే సూపర్ సిక్స్‌లో ఇచ్చిన పథకాలన్నిటిని ఇచ్చిన మాట ప్రకారం నెరవేర్చి నారా చంద్రబాబు నాయుడు సత్తా ఏంటో మరోసారి నిరూపించారని ఈ సందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కత్రిమల ప్రభాకర్ చౌదరి, బొల్లు శ్రీనివాస్ రెడ్డి, జింకల సంజీవ, గౌస్ పీరా, బొమ్మ మోహన్, పామిడి పట్టణ, మండల కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ప్రచార రథం ప్రారంభం



**అనంతపురం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15 :** ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో రెండు నెలలపాటు నిర్వహించే ప్రచార కార్యక్రమంలో భాగంగా ఎల్ఈడి డిస్ ప్లే కలిగిన ప్రచార వాహనాన్ని జిల్లాకు పంపటం జరిగింది. ఎయిడ్స్ వ్యాధి అవగాహన ప్రచార రథం వాహనాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డా.ఈబి.దేవి నగరంలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ఈ వాహనాన్ని జన సమ్మర్ధ ప్రదేశాలలో నిలపాలని, హెచ్.ఐ.వి. ప్రభావిత ప్రాంతాలలో వినియోగించాలని తెలిపారు. జిల్లా లెప్రసి, ఎయిడ్స్ మరియు క్షయ నియంత్రణ అధికారి డా.అనుపమ జేమ్స్ మాట్లాడుతూ ఏపిఎస్ఎసిఎస్ అధికారుల ఆదేశాల మేరకు ఈ వాహనాన్ని రోజుకు 6-8 ప్రాంతాల్లో నిలిపి, హెచ్.ఐ.వి./ఎయిడ్స్, సుఖవ్యాధులు, కౌమార ఆరోగ్యం, మాదక ద్రవ్యాల దుర్వినియోగం తదితర అంశాల పట్ల అవగాహన కల్పించేందుకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించటం జరుగుతుందని, ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డెమో త్యాగరాజు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకట రత్నం, సూపర్వైజర్ జివి.రమణ, సిబ్బంది మురళి, నారాయణ స్వామి, సీపీఓ రమణ, సిబ్బంది నరేష్ బాబు, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రైస్ కార్డ్స్ పంపిణీ చేసిన ప్రజా ప్రతినిధులు

**గుత్తి -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15:** గుత్తి పట్టణం సితార ఫంక్షన్ హాల్ నందు గుంతకల్లు నియోజకవర్గం గౌరవ శాసన సభ్యులు గుమ్మనూ రు జయరాం,అనంత పురం జిల్లా అధ్యక్షులు వెంకట శి వుడు యాదవ్,మున్సిపల్ కమి షనర్ జబ్బర్ మీయా, ఎంఆర్ వో పుణ్యవతి,ఎంపీడీవో ప్రభాకర్ నా యక్,ఏ ఈ ఓ మధు అర్హులైన వా రికి స్మార్ట్ రైస్ కార్డ్స్ పంపిణీ చే యడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ నారా చంద్ర బాబు నాయుడు దూరదృష్టితో ఆలో చించి టెక్నాలజీతో కూడిన స్మార్ట్ రైస్ కార్డ్స్ ని ప్రవేశ పెట్టడం జరి గింది.ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా కోటి యాభై లక్షలు స్మార్ట్ రేష న్ కార్డులు ఇవ్వడం జరిగింది.అని ఆ కార్డు ఎవ్వరి ఫోటోలు లేకుం డా కేవలం లబ్ధిదారుల ఫోటో మా త్రమే ఉంటుంది అని గత ప్రభు త్వంలో గత పాలకుల ఫోటోలు వేసుకుని రేషన్ కార్డులు ఇచ్చే వారని ఎప్పుడు అలాంటి పరిస్థి తి లేకుండా మన ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని ఈ సం దర్భంగా ఎమ్మెల్యే గుమ్మనరు జయరాం తెలిపారు.ఈ కార్యక్ర మంలో గుత్తి పట్టణ మరియు మండ ల కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొ న్నారు.



# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరావు యాదవ్ ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి యలగాల నూకానమ్మ యాదవ్

**డోన్-సూర్య వాస్త వం, సెప్టెంబర్ 15:**ఎన్నికల ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జాతీయ బిసి సంక్షేమ సంఘం తరపున రాష్ట్ర అధ్యక్షులు వై నాగేశ్వరావు, ఆంధ్రప్రదేశ్ ఇంచార్జ్ యలగాల నూకా నమ్మ యాదవ్ సారథ్యంలో జాతీయ బిసి సంక్షేమ సంఘంలో వర్క్ చేస్తున్న ముఖ్య బిసి నాయకులు, మేధా వులు అయిన సుమారు 500 మందిని పిలిచి సమావేశం ఏర్పాటు చేసి, బిసిలకు కూటమి ప్రభుత్వం చేసే మంచి, బిసిలకు ఇచ్చే వాటాలు వివరించారు. చంద్రబాబు గతంలో చేసిన అభివృద్ధి సంక్షేమం తెలుసు కాబట్టి జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ తరపున మద్దతు తెలిపాము.సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టు కొనిసుమారు నలభై మంది కి బిసిలకు ఎమ్మెల్యేలుగా, ఎనిమిది మందికి మంత్రి వర్గంలో ఎంపిలుగా, రాజ్యసభ సభ్యులుగా, శాసనమండలి సభ్యులుగా, పార్టీ పదవుల్లో సగ బాగం వాటాలు ఇచ్చి మాట నిలబెట్టుకున్న చంద్రబాబు గారికి బిసిలు ఎప్పుడు సపోర్టు గా ఉంటారు అని తెలిపారు.అలాగే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు కనీసం 34 % రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. ఎందుకంటే గత ప్రభుత్వం బిసిలకు స్థానిక సంస్థల్లో ఉన్న 34% శాతం





ఉన్న రిజర్వేషన్లు పది శాతం కోత పెట్టి 24 శాతం తో ,ఎన్నికలకు వెళ్లడం ద్వారా 16,500 వందల మంది బిసిలు ప్రజా ప్రతినిధులు అవ్వాలేక పోయారు.

**- బిసి రక్షణ చట్టం అమలుకు కృషి చేయాలని కోరారు**

చట్ట సభల్లో బిసిలకు 50 % శాతం మంది హాజర్కె తమ మద్దతు తెలిపిననందుకు ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకి దేశ ప్రధాని నరేంద్ర మోడీకి బిసిల పట్ల ఉన్న ప్రేమ చిత్తశుద్ధి తెలుస్తోంది పార్లమెంటులో బిసి బిల్లు ఆమోదం పొందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

# కర్నూల్‌లో గంజాయి రవాణా ముఠా అరెస్ట్

**కర్నూల్- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15:** కర్నూలు జిల్లాలో గంజాయి రవాణా ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. కర్నూలు నాలుగవ పట్టణ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి ఉల్లంఘనలకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో ఈ ఘనత నమోదైంది. సబ్ డివిజన్ డీఎస్పీ జె.బాబు ప్రసాద్ నేతృత్వంలో, కల్లూరు తహసిల్దార్ శ్రీఆంజనేయులు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బళ్లారి చౌరస్తా ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు కొందరు యువకులను అదుపులోకి తీసుకున్నారు.ముఠా సభ్యులు ఒడిశా-ఆంధ్రప్రదేశ్ సరిహద్దు నుంచి పెద్ద మొత్తంలో గంజాయిని కర్నూలుకు రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో, పోలీస్ విచారణ వేగవంతం చేశారు. తెల్లవణి టయోటా గ్లాంజా( ఏపీ 40 ఎన్ 3258) కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిపై పోలీసులు అనుమానం నెలకొనడంతో కారును డ్రైవర్లు బలవంతంగా ఆపి తనిఖీ చేశారు.

**20 కేజీ గంజాయి, కారు సీజ్ :** విచారణలో వారు అరకు నుంచి వచ్చినట్టు వెల్లడించగా, ఇంకా లోతుగా




దర్యాప్తు చేయగా కారు డోర్లలో ప్లాస్టిక్ రాపర్లలో చుట్టిన 20 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ. 80,000 రూపాయలకు గంజాయిని కొనుగోలు చేసి, ఒక్కో పాకెట్ రూ. 500 చొప్పున అమ్ముకుని మొత్తంగా రూ. 4 లక్షలు సంపాదించుకోవాలనే ఉద్దేశంతో ముఠా సభ్యులు కర్నూలుకు వచ్చినట్టు వెల్లడించారు.

**ఈ సందర్భంగా పోలీసులు టయోటా గ్లాంజా కారును సీజ్ చేశారు. ఈ కేసులో ఐదుగురు యువకులు అరెస్ట్ అయ్యారు. వారు:**

- మీనుగ నరేంద్ర (మాదన్న నగర్, పంచలింగాల, కర్నూలు)
- నల్లగొట్టి ఉమేష్ చంద్ర (ధర్మపేట, కర్నూలు)
- సిరిగిరి మృత్యుంజయ రెడ్డి (ఎస్ఎస్ నగర్, జిల్లా కోర్టు సమీపం, కర్నూలు)
- షేక్ మహమ్మద్ ఆరిఫ్ (ఎస్బీఐ కాలనీ, కర్నూలు)
- పగిద్యాల చాకలి గోవర్ధన్ (కొత్తపేట, కర్నూలు)

**తల్లిదండ్రులకు పోలీసుల విజ్ఞప్తి:**

పిల్లల కదలికలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని, ఎవరైనా గంజాయికి అలవాటు పడుతున్నారని కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అప్పుడు వారికి మానసిక కేంద్రాల్లో చికిత్స అందిం చగలామని పోలీసులు తెలిపారు. పిల్లల భవిష్యత్తును కాపాడేందుకు ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

### కాంగ్రెస్‌పై, నెహ్రూపై

# మోడీ వ్యాఖ్యలు హాస్యాస్పదం, ఆక్షేపనీయం

### - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి

**వేంపల్లి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15:**దేశ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ రక్షణ కల్పిస్తోందని, నెహ్రూ సర్కారు వల్లే దేశానికి కష్టాలు వచ్చాయని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించడం హాస్యాస్పదం, ఆక్షేపనియమని రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు.సోమవారం తులసి రెడ్డి వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశానికి స్వాతంత్రం తెచ్చిన పార్టీ అని, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాధినేతలను దేశ పొలిమేరల నుండి తరిమికొట్టిన పార్టీ అన్నారు.నవభారత నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ ప్రముఖ పాత్ర వహించింది అన్నారు. జాతి పిత మహాత్ముడు, శాంతిదూత నెహ్రూ,విప్లవ నేత సుభాష్ చంద్రబోస్ ,రైతు బిడ్డ నీలం సంజీవరెడ్డి, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, ఉక్కు మహిళ ఇందిరమ్మ, త్యాగశీలి సోనియమ్మ లాంటి గొప్ప నాయకులు నాయకత్వం వహించిన పార్టీ అన్నారు.కాంగ్రెస్ పార్టీ దేశభక్తుల పార్టీ, త్యాగధనుల పార్టీ. దేశ సమైక్యత, సమగ్రత ,సార్వభౌమత్వం కోసం మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ ,రాజీవ్ గాంధీ లాంటి కాంగ్రెస్ ప్రముఖ నాయకులు ఆత్మ బలిదానం చేశారని తులసిరెడ్డి గుర్తు చేశారు.భారత తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ నవభారత నిర్మాత. అసలు సిసలు ప్రజాస్వామ్యవాది, లౌకికవాది .శాస్త్ర సాంకేతిక రంగాలను అభివృద్ధి చేసి తద్వారా దేశంలో వ్యవసాయ విప్లవాన్ని ,పారిశ్రామిక విప్లవాన్ని తీసుకొచ్చిన దూరదృష్టి



గల నేత జవహర్లాల్ నెహ్రూ .సాగునీటి ప్రాజెక్టులను, కర్మాగారాలను ఆధునిక దేవాలయాలుగా అభివర్ణించిన రాజ నీతిజ్ఞుడు. మన పొరుగు దేశాలైన శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్ ,నేపాల్, పాకిస్తాన్ల మాదిరిగా కాకుండా నిజమైన ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం మనుగడ సాగిస్తూ ఉందంటే దానికి కారకుడు జవహర్లాల్ నెహ్రూ.అటువంటి నెహ్రూపైన ,కాంగ్రెస్ పైన ప్రధాని మోడీ విమర్శలు చేయడం శోచనీయం.ఆకాశం మీద ఉమ్మి వేస్తే అది తిరిగి తమ తమ ముఖం మీదనే పడుతుందన్న నగ్న సత్యాన్ని మోడీ,బిజెపి నాయ కులు గ్రహిస్తే మంచిది.నడ్డా వ్యాఖ్యలు హాస్యాస్పదం. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు వీరిద్దరి డబుల్ ఇంజన్ పాలనలో ఆంధ్ర ప్రదేశ్ వెలిగిపోతుందని బిజెపి జాతీయ అధ్యక్షులు నడ్డా వ్యాఖ్యానించడం విడ్డూరమని తులసిరెడ్డి ధ్వజమెత్తారు.ప్రధాని హోదాలో మోడీ ,ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని తులసి రెడ్డి అన్నారు.రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రత్యేక హోదా 11 సంవత్సరాలు అయినా అమలు కాలేదు .రాయలసీమకు ,ఉత్తరాంధ్రకు బుందేల?ండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ అమలు కాలేదు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వ ర్యంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం కాలేదు. దుగ్గరాజపట్నం మేజర్ ఓడు రేవు రాలేదు.11 సంవత్సరాల అయినా 9 ,10 షెడ్యూల్లోని సంస్థలు ఇప ్పటికీ ఆంధ్రప్రదేశ్ కు రాలేదు.ప్రపంచంలో నాలుగవ ఆర్థిక శక్తిగా ఎదిగామని పదేపదే చెప్పుకోవడం హాస్యా స్పదం. తలసరి ఆదాయంలో ప్రపంచ దేశాలలో 136వ స్థానంలో ఉన్నాం .జనాభా 144 కోట్ల కాబట్టి ఆర్థిక శక్తిగా ఎదిగినట్లు మనకు కనిపిస్తుంది .ఇది వాపు తప్ప బలుపు కాదు.పేరుకే డబల్ ఇంజన్ .ఆచరణలో ట్రబులింజన్‌గా తయారు అయిందని తులసి రెడ్డి ఎద్దేవా చేశారు .2023-24 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుండి రాష్ట్రానికి 34698 కోట్ల రూపాయలు గ్రాంట్ రూపంలో రాగా డబుల్ ఇంజన్ సర్కార్లో 2024ు- 25 లో కేవలం రూ 20,135 కోట్లు మాత్రమే కేంద్రం నుండి రాష్ట్రానికి గ్రాంటు వచ్చింది.

14563 కోట్ల రూపాయలు తగ్గింది.2004లో కూడా ఆనాటి టిడిపి బిజెపి ప్రభుత్వం లో,దేశం, రాష్ట్రం వెలిగి పోతున్నాయని చెప్పారు .చివరికి 2004 ఎన్నికల్లో ప్రజలు బిజెపి ,టిడిపిని చిత్తుచిత్తుగా ఓడించి కాంగ్రెస్ ను గెలిపించారు.2029లో కూడా అదే జరగబోతుంది అని తులసి రెడ్డి జోష్యం చెప్పారు.

# తురకపాలెంలో యురేనియం అవశేషాలు గుర్తింపు



**గుంటూరు -సూర్య వాస్తవం:** గుంటూరు జిల్లాలోని తురకపాలెంలో వరుస మరణాలతో జాతీయ వ్యాధుల నియంత్రణ కేంద్రం దీనిపై ఫోకస్ చేసింది. చెన్నైలో చేసిన టెస్టుల్లో యురేనియం ఉన్నట్లు గుర్తించారు.ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లాలోని తురకపాలెంలో రెండు నెలల్లో ముప్ఫయి మందికి పైగా మరణించడానికి గల కారణాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. అయితే తురకపాలెంలో మరణాలకు ఒక ఆర్ఎంపీ ఇచ్చిన మందులు, ఇన్ ఫెక్షన్లు కారణమయి ఉండవచ్చని ఆ దిశగా విచారణ సాగింది. ఆ ఆర్ఎంపీని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆర్ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్ ను కూడా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సీజ్ చేశారు. అయితే తాజాగా తురకపాలెంలో మరణాలకు, అనారోగ్య సమస్యలకు యూరేనియం అవశేషాలు కలిసిన నీరు తాగడం వల్లనే నంటూ మరో అధ్యయనంలో వెల్లడి కావడం విశేషం. గ్రామంలో అందరికీ రక్త పరీక్షలు నిర్వహిం చారు. వాటిని ల్యాబ్ కు పంపించారు. అంతేకాదు నీరు, మట్టి నమూనాలను కూడా సేకరించి పరీక్షల కోసం ల్యాబ్ కు పంపారు. అయితే నీటి నమూనాలు మాత్రం చెన్నై ల్యాబ్ కు పంపారు. ఈ ల్యాబ్ నుంచి రిజల్ట్ వచ్చినట్లు సమాచారం. అందులో తురకపాలెంలో ఉన్న నీటిలో యురేనియం అవశేషాలు వెల్లడయినట్లు తెలిసింది. తురకపాలెం గ్రామం చుట్టూ అనేక క్వారీలు ఉన్నందునఅక్కడ క్వారీ గుంతల్లో నీటిని ప్రజలు వినియోగి స్తున్నందున ఈ మరణాలు, తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తినట్లు తెలిసింది. స్ట్రాన్షియం అనే పదార్థంతో పాటు ఈకొలి బాక్టిరియా కూడా నీటిలో ఉన్నట్లు కనుగొన్నారని చెబుతున్నారు. అలాగే గ్రామంలో వివిధ ప్రాంతాల్లో నీటి నమూనాలను సేకరించి ల్యాబ్ కు పంపారు. కానీ ఒక్క చోట తప్ప మిగిలిన చోట్ల ఎక్కడా బాక్టీరియా ఆనవాళ్లు లేవని గుర్తించారు. అయితే చెన్నై నివేదికలో మాత్రం అందుకు విరుద్ధంగా ఫలితాలు రావడంతో అక్కడి తాగు నీటి వల్లనే ఈ మరణాలు, తీవ్రమైన అనారోగ్యానికి కారణాలుగా వైద్యులు భావిస్తున్నారు. యురేనియం శరీరంలోకి వెళితే చాలా వెళితే చాలా ప్రమాదమని, దీనిద్వారా తొలుత కిడ్నీలకు, తర్వాత చర్మ సంబంధితమైన వ్యాధులు తలెత్తడమే కాకుండా మెదడు, కాలేయం, ఊపిరితిత్తులు, ఎముకలను దెబ్బతినడం ఖాయమని, అవే మరణాలకు కారణం కావచ్చని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. పరిశోధన కోసం గ్రామంలోని త్రాగు నీరు, మట్టి, స్థానికుల రక్త నమూనాలను సేకరించి చెన్నై, ఎయిమ్స్, గుంటూరు జీజీహెచ్ ల్యాబ్‌లకు పంపించారు. రెండు నెలల వ్యవధిలో 30 మందికి పైగా చనిపోవడంతో గ్రామంలో భయాందోళన నెలకొంది. జ్వరాలు వస్తున్నాయని ఆస్పత్రికి తీసుకెళ్తే మళ్లీ ఇంటికి తిరిగొచ్చే వారు తక్కువ అని గ్రామస్తులు చెబుతున్నారు.

చిన్న జ్వరాలకే ప్రాణాలు పోతున్నాయని, దీని వెనుక ఏదో పెద్ద కారణం ఉందని తురకపాలెం వాసులు అధికారులకు తెలిపారు. గత కొన్ని నెలలుగా గ్రామంలో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, ప్రాణాలు పోవడం ఆందోళన కలిగిస్తుందని చెప్పారు. జాతీయ వ్యాధుల నియంత్రణ కేంద్రం ఆధ్వర్యంలోని వైద్య నిపుణులు గుంటూరు శివారులోని తురకపాలెంను మంగళవారం (సెప్టెంబర్ 9న) సందర్శించారు. అసాధారణ మరణాలకు కారణాలపై ఎన్‌సీడీసీ సంయుక్త సంచాలకురాలు డాక్టర్ హేమలత, నోడల్ అధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలోని బృందం గ్రామంలో సమీక్షించింది. గ్రామస్తులను అడిగి పరిస్థితి తెలుసుకుని, కొన్ని వివరాలు సేకరించారు. చెన్నైలో పరీక్షించిన నీటి నమూనాల ఫలితాలు శనివారం వెలుగులోకి వచ్చాయి. అందులో తురకపాలెం పరిసరాల నీటిలో యురేనియం అవశేషాలు ఉన్నట్టు తేలింది. ఈ ప్రాంతంలో రాళ్ల క్వారీలు విస్తారంగా ఉండటం, వాటిలోనే స్థానికులు పని చేయడం, అలాగే ఆ క్వారీ గుంతలలోని నీటిని వినియోగి ంచడమే ఈ సమస్యకు కారణమ య్యుం డవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అలాగే, నీటిలో స్ట్రాన్షియం అనే హానికర మూలకం , ఈకొలి బ్యాక్టీరియా కూడా ఉన్నట్లు చెన్నై నివేదికలో తేలింది. అయితే, మొదటిసారిగా నిర్వహించిన పరీక్షల్లో మాత్రం బ్యాక్టీరియా కేవలం ఒకేచోటే ఉన్నట్లు గుర్తించారు.

ఈ విషయంపై చెన్నై నివేదిక ఫలితాలు కొంత భిన్నంగా వచ్చాయని అధికారులు తెలిపారు. యురేనియం మానవ శరీరానికి ఎంతో ప్రమాదకరం అని డాక్టర్లు చెబుతున్నారు. ఇది తాగునీరు లేదా ఆహార మార్గంలో శరీరంలోకి ప్రవేశిస్తే మొదటగా మూత్రపిండాలకు తీవ్ర నష్టం కలుగుతుంది. అనంతరం చర్మ సమస్యలు, కాలేయం, మెదడు, ఊపి రితిత్తులు, ఎముకలకు దెబ్బతీసి ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరించారు. పూర్తి సమా చారం మాత్రం ఇంకా అందాల్సి ఉండటంతో గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దీనిపైఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అప్పటి వరకూ వారికి రోజూ భోజనం, మంచినీరు అందించాలని నిర్ణయించారు.

# మళ్లీ దగ్గరవుతున్న జవహర్



**విజయవాడ -సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ రాజకీయా ల్లోనూ, అందులో తెలుగుదేశం పార్టీలో మాజీ మంత్రి కేఎస్ జవహర్ మళ్లీ అధిష్టానానికి దగ్గరయ్యారు. ఆయన వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కోసం ఇప్పటి నుంచే తన ప్రయత్నాలు మొదలు పెట్టినట్లుంది. కేఎస్ జవహర్ కు 2024 లో జరిగిన ఎన్నికల్లో టిక్కెట్ దక్కలేదు. ఆయన 2014లో కొవ్వూరు అసెంబ్లీ నియోజ కవర్గం నుంచి పోటీ చేశారు. ఉపాధ్యాయ వృత్తి చేస్తూ రాజకీయాల్లోకి వచ్చిన జగన్ వచ్చిన వెంటనే ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడమే కాకుండా మంత్రి పదవి కూడా వరించింది. అయితే కొవ్వూరు నియోజకవర్గంలోని టీడీపీ నేతలతో పొసగక పోవడంతో ఆయన రాజకీయ జీవితంలో స్పీడ్ కు కొంత ఫుల్ స్టాప్ పడినట్లయిందన్నది వాస్తవం. కొవ్వూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కె. జవహర్ ను అక్కడి నేతలు వ్యతిరేకించడంతో 2019 ఎన్నికలలో ఆయనను తిరువూరుకు చంద్రబాబు పంపించారు. అయితే అక్కడ ఆయన వైసీపీ అభ్యర్థి రక్షణ నిధి చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే తిరువూరు మొన్నటి ఎన్నికల్లో కొలికపూడి శ్రీనివాసరావుకు కేటాయించారు. అమరావతి ఉద్యమంలో పాల్గొన్న కొలికపూడికి టిక్కెట్ ఇవ్వడంతో ఆయన అక్కడ ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే తిరువూరులో కొలికపూడికి, అక్కడి పార్టీ నేతలకు, క్యాడర్ కు పడకపోవడం, అనేక వివాదాలు చోటు చేసుకుంటు ఉడటంతో జవహర్ చూపు తిరిగి తిరువూరు పై పడిందని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో జవహర్ తిరువూరు నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొవ్వూరు కంటే ఆయనకు తిరువూరు పైనే ప్రస్తుతం దృష్టి ఉన్నట్లు కనపడుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత చంద్రబాబు భర్తీ చేసిన నామినేటెడ్ పోస్టుల్లో జవహర్ కు కీలకమైన పోస్టు లభించింది. ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ గా నియమితులయ్యారు. కొవ్వూరు నియోజకవర్గంలో బలమైన కమ్మ సామాజికవర్గానికి చెందిన నేతలు తనను తిరిగి కొవ్వూరుకు రానివ్వరన్న నమ్మకంతో ఆయన తిరువూరునే ఎంచుకుంటున్నట్లు తెలిసింది.

ఈ మేరకు ఆయన సన్నిహితుల వద్ద కూడా తాను తిరువూరును ఎంచుకుంటానని చెబుతుననట్లు తెలిసింది. జవహర్ ను ఎన్నికల సమయంలో రాజమండ్రి పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా నియమించారు. అయినా సరే కొవ్వూరు వద్దు.. తిరువూరు ముద్దు అంటున్నారట జవహర్. మరి చంద్రబాబు నాలుగేళ్ల తర్వాత ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది తెలియకపోయినా తన ప్రయత్నంలో లోపం లేకుండా చూసుకుంటున్నారట.

# అందుబాటులోకి నానో యూరియా




**ఏలూరు-సూర్య వాస్తవం:** ఏపీలో యూరియా కొరత పొలిటికల్ హీట్ ఎక్కించింది. ప్రభుత్వం యూరియా కొరత లేకుండా చేసాం అంటూ ప్రకటన చేసింది. కానీ ప్రతిపక్షాలు మాత్రం ఈ విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో యూరియాను పెద్ద ఎత్తున అందుబాటులోకి తెస్తోంది ఏపీ ప్రభుత్వం. మరోవైపు నానో యూరియా సైతం అందుబాటులోకి వచ్చింది. బస్తాలను మోసుకెళ్లే పని లేకుండా అర లీటర్ నానో యూరియా వాడితే సరిపోతుంది. అంటే ద్రవ రూపంలో ఈ నానో యూరియా అందుబాటులోకి వచ్చింది. దీని వినియోగం కూడా చాలా సులువు అని చెబుతున్నారు అధికారులు. యూరియా కొరత ఉన్న నేపథ్యంలో ఈ నానో యూరియా వాడాలని అధికారులు సూచిస్తున్నారు. వరి, పత్తి వంటి పంటలపై ఈ నానో యూరియా పిచ్చికారి చేయవచ్చు. గత కొద్దిరోజులుగా అధికారులు అవగాహన పెంచడంతో ఈ నానో యూరియా వాడకం పెరిగిందిఅయితే ఇప్పటివరకు ఏపీలో పాత పద్ధతిలోనే ఎరువులను వాడుతున్నారు. నానో యూరియాత అధిక ప్రయోజనాలు ఉన్న దాని జోలికి పోవడం లేదు. వ్యవసాయ శాఖ నిపుణులు, శాస్త్రవేత్తలు యూరియాకు బదులుగా నానో యూరియా వాడాలని సూచిస్తున్నారు. సాధారణ యూరియా బస్తాలో ఉండే పోషకాలు.. అర లీటరు నానో యూరియాలో ఉంటాయని చెబుతున్నారు.

సాధారణ యూరియా గుళికల రూపంలో ఉంటే.. నానో యూరియా ద్రవ రూపంలో ఉంటుంది. సాధారణంగా రైతులు ఉపయోగించే యూరి యాలో కణాల పరిణామం 2.8-4 మిల్లీ మైక్రాన్లు ఉంటే.. అందులో మొక్కకు 30% వరకు మాత్రమే చేరు తుంది. మిగిలిన యూ రియా నీటిలోనూ, భూమిలోను కలిసి పోతుం దని నిపుణులు చెబు తున్నారు. శత శాతం పంటలకు ఉపయో గపడుతుంది. ఈనానో యూరియా కణాల పరిణామం 32 నానో మైక్రాన్లు ఉంటుంది. ఏకంగా 80% పైగా మొక్కకు చేరుతుంది. అస్సలు వృధా ఉండదు. కాలుష్యం కూడా తగ్గే అవకాశం ఉంది. రైతులు ఉపయోగిస్తున్న సాధారణ యూరియా వేర్ల ద్వారా మొక్కకు అందె ందుకు ఆలస్యం అవుతుంది. నానో యూరియా అలా మొక్కల ఆకులపై పిచికారి చేయగానే నేరుగా పత్ర హరితానికి చేరి వెంటనే ప్రభావం చూపుతుంది. ఎకరాకు అర లీటరు నానో యూరియా సరిపోతుంది. సాధారణ యూరియాతో పోల్చుకుంటే ధర కూడా తక్కువ. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది.



# మదనపల్లె, తంబళ్లపల్లె మండలాల్లో రెండు ఫోక్సో కేసులు



**మదనపల్లె -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15:**అన్నమయ్య జిల్లాలో రెండు అమానుష ఘటనలు చోటు చేసుకోవడం కలకలం రేపుతోంది. మదనపల్లె మండలంలోని ఓ గ్రామంలో 8వ తరగతి చదువుతున్న15ఏళ్ల బాలిక ఊరికి సమీపంలోని తన వ్యవసాయ బోరు వద్ద ఒంటరిగా ఉండగా, అదే ఊరికి చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ నరసింహులు విద్యార్థినిపై అత్యాచారం కు వడిగట్టాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో తాలుక సీఐ కళా వెంకటరమణ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే మరో సంఘటన తంబళ్లపల్లె మండలంలో సోమవారం జరిగింది. ఓ గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలికపై అదే ఊరికి చెందిన 12 ఏళ్ల బాలుడు లైంగిక దాడికి పాల్పడడంతో, బాలిక కుటుంబీకుల ఫిర్యాదు పై తంబళ్లపల్లి ఎస్సై ఉమా మహేశ్వర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఘనంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతి వేడుకలు




**గుత్తి -సూర్య వాస్తవం, సెప్టెంబర్15 :** గుత్తి కర్ణాటక కు చెందిన మోక్ష గుండం విశ్వేశ్వరయ్య భారత దేశపు ప్రముఖ ఇంజనీర్,పండి తుడు,రాజ నీతిజ్ఞుడు.ఇంజినీ రింగ్ దినోత్సవం సందర్భంగా 16 4వ జయంతి ని ఘనంగా నిర్వ హించారు.ఈ సందర్భంగా పెన్ష నర్లు భవనంలో ఆయన చిత్ర ప టానికి పూల మాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా నా యకులు మాట్లాడుతూ వీరు ఇం జినీరింగ్ పూర్తి చేసిన తరువాత దక్కన్ ప్రాంతంలో చక్కటి నీటి పారుదల వ్యవస్థను రూపొంచ డంలోనిమగ్నమయ్యారు.ఈయనకు భారత రత్న,గౌరవ డాక్టరేట్ మొదలై న బిరుదులతో సత్కరిం చ బడ్డారు.ఈ కార్యక్రమంలో పె న్షనర్స్ అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ,సెక్రెటరీ రామ్ మోహ న్,కోశాధికారి జెన్నేకుల్లాయిబా బు,లక్ష్మీ నారాయణరెడ్డి,వెంక టేష్,షైక్షా వలి,హసన్ అహమ్మ ద్,దేవదాస్,మద్దులేటి,గోవింద ప్ప,నరసింహులు మొదలగువారు పాల్గొన్నారు.


# హోటల్ రంగాన్ని బలోపేతం చేసి అభివృద్ధి పథంలో నడిపిస్తాం...

## - ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కలమాడి రమణ



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హోటల్ అసోసియేషన్ రంగాన్ని రానున్న కాలంలో బలోపేతం చేసి అభివృద్ధి పదంలో నడిపిస్తామని ఆంధ్రప్రదేశ్ హెూటల్స్ అసోసి యేషన్ జనరల్ సెక్రెటరీ కలమాడి రమణ తెలిపారు.హెూటల్ రంగం ఎదుర్కొం టున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి న్యాయం చేయాలని కోరారు. హెూటల్ రంగం ఒక ఇండిస్ట్రీగా పనిచేస్తూ లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తోందని, ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయంతో పాటు పర్యాటకంగా అనేక సేవలను అందిస్తోందని తెలిపారు.కలమాడి రమణ జనరల్ సెక్రెటరీగా ఎన్నికైన సందర్భంగా జిల్లా హెూటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రుచి రెస్టారెంట్ రమణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెఎసి అమరావతి అనంతపురం జిల్లా రెవిన్యూ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ఎన్ దివాకర్ రావు, ఏపీ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ సంఘం ఈసీ మెంబర్ తలారి పెద్దయ్య మాట్లాడుతూ.....కాలమాడి రమణ హెూటల్స్ అసోసియేషన్‌కు చేసిన సేవలు కొనియాడారు.రాష్ట్రంలో హెూటల్ రంగం మరింత అభివృద్ధి పదంలో ఆయన నడిపిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోటి చెన్నప్ప, ప్రసాద్, అనంతయ్య, కలందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు



**ఖమ్మం-సూర్య వాస్తవం:**ఖమ్మం కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు బయటపడింది. ఇరువర్గాలు కర్రలతో పరస్పర దాడులు జరుపుకున్నాయి. ఘటనలో ఒక వ్యక్తి చెవి తెగిపోయింది. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలో వర్గపోరు నేపథ్యంలో పార్టీ నేతలు కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. న్న ఒక వ్యక్తి చెవి తెగిపోగా, మరో వ్యక్తిని మహిళలు చెప్పులతో కొట్టారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అందరిని చెదరగొట్టారు.




### ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్

# పూర్తి చేసిన పవర్ స్టార్ పవన్ కళ్యాణ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవన్ కళ్యాణ్-హరీష్ శంకర్ కలయికలో వస్తున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. తాజాగా చిత్ర బృందం భారీ షెడ్యూల్‌ను విజయవంతంగా ముగించింది. దీంతో పవన్ కళ్యాణ్ తన భాగం చిత్రీకరణను పూర్తి చేశారు.ప్రజా సేవలో పవన్ కళ్యాణ్ తీరిక లేకుండా ఉన్నప్పటికీ, సినిమా పట్ల విశేషమైన అంకితభావం మరియు మక్కువను ప్రదర్శించారు. చిత్రీకరణ సమయంలో పవన్ కళ్యాణ్ చూపించిన నిబద్ధత, తెరపై మరియు తెర వెలుపల కూడా ఆయన అసాధారణ వ్యక్తిగా మన్ననలు ఎందుకు అందుకుంటున్నారో మరోసారి నిరూపించింది. పవన్ కళ్యాణ్ ఎంతో నిబద్ధతతో ఈ సినిమా షూటింగ్‌లో తన భాగాన్ని పూర్తి చేశారు.ఈ కీలకమైన షెడ్యూల్‌ను పూర్తి చేయడానికి నటీనటులు మరియు సిబ్బందితో కలిసి దర్శకుడు హరీష్ శంకర్ అహర్నిశలు శ్రమించారు. టాకీ పార్ట్‌లో ఎక్కువ భాగం పూర్తి కావడం, షూటింగ్ సజావుగా సాగడం పట్ల నిర్మాతలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై నెలకొన్న ఆకాశాన్ని తాకే అంచనాలను అందుకునేందుకు చిత్ర బృందం అన్ని విధాలుగా కృషి చేస్తోంది. ఈ సినిమా కోసం అత్యున్నత స్థాయి సాంకేతిక బృందం పనిచేస్తోంది. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. రామ్-లక్ష్మణ్ ద్వయం యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. అయనంక బోస్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తుండగా, నీతా లుల్లా కాస్ట్యూమ్స్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. కళా దర్శకుడిగా ఆనంద్ సాయి వ్యవహరిస్తున్నారు. పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు.. మాస్ ప్రేక్షకులు, యాక్షన్ ప్రియులు మెచ్చేలా ఈ చిత్రాన్ని మలుస్తున్నారు.చిత్రీకరణ తుదిదశకు చేరుకున్న తరుణంలో చిత్ర బృందం త్వరలోనే నిర్మాణాంతర కార్యక్రమాలను మొదలు పెట్టనుంది.

ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.తారాగణం: పవన్ కళ్యాణ్, శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. పార్థిబన్, కె.ఎస్. రవికుమార్, ఎల్ బి శ్రీరామ్, రాంకీ, ప్రభాస్ శ్రీను, సత్యం రాజేష్, జయ ప్రకాష్, వర్గీస్, మీర్ సర్వర్, ప్రవీణ్, టెంపర్ వంశీ, నవాబ్ షా, శ్రీరామ్, మాగంటి శ్రీనాథ్, కిల్లి క్రాంతి తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

# ఓవర్ నైట్ స్టార్‌గా తేజ



తేజ సజ్జ హీరో గా నటించిన 'మిరాయ్' చిత్రం రీసెంట్ గానే భారీ అంచనాల నడుమ విడుదలై బాక్స్ ఆఫీస్ వద్ద అద్భుతాలను నెలకొల్పుతూ ముందుకు దూసుకుపోతుంది. నిర్మాతలు చెప్తున్నా లెక్కల ప్రకారం ఈ సినిమాకు రెండు రోజుల్లో వరల్డ్ వైడ్ గా 55 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లు వచ్చాయి. సాధారణంగా ఏ సినిమా నిర్మాత అయినా వచ్చిన డబ్బులకంటే ఎక్కువ డబ్బులు వచ్చినట్టుగా పోస్టర్స్ లో వేసి చూపిస్తుంటారు. కానీ మిరాయ్ నిర్మాతలు అలా చేయడం లేదు. ఎంత కలెక్షన్స్ అయితే వచ్చాయో, అంతే పోస్టర్స్ లో వేసే ప్రయత్నం చేశారు. 55 కోట్ల రూపాయిల గ్రాస్ అని చెప్పారు కానీ, ట్రేడ్ విశ్లేషకులు అందిస్తున్న లెక్కల ప్రకారం చూస్తే ఈ చిత్రానికి రెండు రోజుల్లో వచ్చింది 53 కోట్ల రూపాయిలు మాత్రమే. కానీ తెలుగు రాష్ట్రాల్లో మాత్రం మొదటిరోజు కంటే ఎక్కువ వసూళ్లు వచ్చాయని అంటున్నారు.ట్రేడ్ పండితులు అందిస్తున్న సమాచారం ప్రకారం ఈ చిత్రానికి రెండవ రోజున 8 కోట్ల 20 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయట. ఈ ఏడాది భారీ అంచనాల నడుమ విడుదలైన రామ్ చరణ్ గేమ్ చేంజర్, పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' చిత్రాలకు కూడా ఈ రేంజ్ షేర్ వసూళ్లు రాకపోవడం గమనార్హం. మూడవ రోజు అయితే రెండవ రోజు కంటే అద్భుతమైన ఆక్యుపెన్సీలు నమోదు అవుతున్నాయట. ప్రస్తుతం ఉన్న ట్రెండ్ ప్రకారం చూస్తే ఈ చిత్రం కచ్చితంగా రెండవ రోజు కంటే ఎక్కువ వసూళ్లను రాబట్టే అవకాశం ఉందని అంటున్నారు. హిందీ లో కూడా రెండవ రోజున ఈ చిత్రానికి 3 కోట్ల 50 లక్షల రూపాయిల నెట్ వసూళ్లను రాబట్టింది. గ్రాస్ వసూళ్లు దాదాపుగా 5 కోట్ల రూపాయిల వరకు ఉండొచ్చు. ఓవర్సీస్ లో కూడా రెండవ రోజున ఈ చిత్రం హాఫ్ మిలియన్ డాలర్ల గ్రాస్ వసూళ్లను రాబట్టినట్టు సమాచారం.ఓవరాల్ గా చూస్తే రెండవ రోజున ఈ చిత్రానికి 27 కోట్ల రూపాయిల వరకు గ్రాస్ వసూళ్లు వచ్చాయని అంటున్నారు. ఈరోజు 30 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వస్తాయట. అలా ఓవరాల్ గా ఈ చిత్రం మూడు రోజుల్లో 85 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లను రాబట్టే సూచనలు కనిపిస్తున్నాయని, బ్రేక్ ఈవెన్ మార్కుని కూడా అవలీల గా దాటిందని అంటున్నారు. మరి ఇదే రేంజ్ స్టడీ రన్ ని ఈ చిత్రం రేపటి నుండి కూడా కొనసాగించగలిగితే ఫుల్ రన్ లో ఎంత వసూళ్లు వస్తాయో చూడాలి. 'హనుమాన్' చిత్రం దాదాపుగా 400 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. మిరాయ్ చిత్రం కనీసం 200 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లను అయినా రాబడుతుందో లేదో చూడాలి.






# పాకిస్తాన్ కు తీవ్ర అవమానం




పహల్గాం దాడి తర్వాత పాకిస్తాన్ తో క్రికెట్ ఆడటాన్ని సగటు భారతీయుడు తప్పు పట్టాడు. క్రికెట్ అభిమానులయితే భారత జట్టు మేనేజ్మెంట్ మీద తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రక్తం, నెత్తురు కలసి ప్రవహించలేవు అని చెప్పినవారు.. ఇప్పుడు ఎందుకు క్రికెట్ ఆడుతున్నారంటూ విమర్శించారు. సోషల్ మీడియాలో ఒక ఉద్యమాన్ని కూడా నడిపారు. మైదానంలో కాదు, చివరికి టీవీలో కూడా మ్యాచ్ చూడకూడదని తీర్మానించుకున్నారు. అయితే టీమిండియా ద్వైపాక్షిక సిరీస్ ఆడటం లేదని.. కేవలం న్యూట్రల్ వేదిక మీద మాత్రమే సిరీస్ ఆడుతోందని.. అది కూడా ఐసీసీ నిర్వహిస్తున్న మెగా టోర్నీ అని.. ఇందులో వివాదానికి తావు లేదని కేంద్ర క్రీడా శాఖ మంత్రి, బిసిసిఐ క్లారిటీ ఇచ్చాయి. అయినప్పటికీ వ్యతిరేక ఉద్యమం ఆగలేదు.మైదానంలోకి ప్రేక్షకులు భారీగానే వచ్చారు. టీవీలలో కూడా మ్యాచ్ ను భారీగానే వీక్షించారు. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన పాకిస్తాన్ జట్టు ముందు బ్యాటింగ్ ఎంచుకుంది.. భారత బౌలర్లు పిచ్ మీద డ్యూ ను సద్వినియోగం చేసుకొని అద్భుతంగా బౌలింగ్ వేశారు. నిర్ణీత 20 ఓవర్లలో పాకిస్తాన్ జట్టును 127 పరుగులకు పరిమితం చేశారు. కులదీప్ మూడు, అక్షర్, బుమ్రా చెరి రెండు వికెట్లు దక్కించుకున్నారు. పాకిస్తాన్ జట్టులో ఫర్హాన్ 40, అఫ్రీది 33 పరుగులతో టాప్ స్కోరర్లుగా నిలిచారు. చివర్లో అఫ్రిది 16 బంతుల్లో నాలుగు సిక్సర్లు కొట్టి 33 పగులు చేయడంతో పాకిస్తాన్ ఆమాత్రమైన స్కోర్ చేయగలిగింది.అనంతరం 128 పరుగుల విజయ లక్ష్యంతో రంగంలోకి దిగిన టీమిండియా ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. తొలి ఓవర్ నుంచి పాకిస్తాన్ మీద ఎదురుదాడికి దిగడం మొదలు పెట్టింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (31) దుమ్మురేపాడు. మరో ఓపెనర్ గిల్(10) నిరాశపరచాడు. కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ (47×), తిలక్ వర్మ (31), శివం దుబే(10×) సత్తా చూపించడంతో భారత జట్టు 15.5 ఓవర్లలో మూడు వికెట్ల కోల్పోయి టార్గెట్ ఫినిష్ చేసింది. ఈ విజయం ద్వారా టీమిండియా టాప్ 4 లోకి చేరుకుంది.. అయితే ఈ ఓటమి తర్వాత పాకిస్తాన్ జట్టుకు మరో షాకిచ్చింది టీం ఇండియా. టాస్ వేసే ప్రక్రియలో పాకిస్తాన్ కెప్టెన్ గెలిచినప్పటికీ.. అతడికి టీమ్ ఇండియా కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ షేక్ హ్యాండ్ కూడా ఇవ్వలేదు. మ్యాచ్ గెలిచిన తర్వాత భారత ప్లేయర్లు పాకిస్తాన్ ప్లేయర్లతో షేక్ హ్యాండ్ ఇవ్వడానికి ఆసక్తి చూపించలేదు. క్రికెట్ నిబంధనల ప్రకారం మ్యాచ్ గెలిచిన తర్వాత ఓడిన, గెలిచిన జట్లు కరచాలనం చేసుకొంటాయి. గెలిచిన జట్టును ఓడిన జట్టు అభినందిస్తుంది. కానీ ఆదివారం నాటి మ్యాచ్లో ఇది ఏదీ చోటు చేసుకోలేదు. దీనిని బట్టి పహల్గాం దాడికి సరైన రివెంజ్ తీర్చుకున్నట్టు అయిందని భారత అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు.

# మెరిసిన వసీం, షరాఫు

**-సూపర్-4 రేసులో యుఎఇ**
**-వరుసగా రెండో ఓటమితో ఒమన్ ఔట్.**




**అబుదాబి:** ఆసియా కప్ క్రికెట్ టోర్నీలో ఆతిథ్య యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జట్టు బోణీకొట్టింది. గ్రూప్-ఎ తొలి లీగ్‌లో భారత్ చేతిలో ఓడిన యుఎఇ.. రెండో లీగ్ మ్యాచ్‌లో ఒమన్‌ను చిత్తుచేసి సూపర్-4 రేసులో నిలిచింది. సోమవారం ఒమన్‌తో జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో యుఎఇ జట్టు 42 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సొంతగడ్డపై తమదైన ఆటతో ఒమన్ బౌలర్లపై విరుచుకుపడి నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 172 పరుగుల భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ ముహమ్మద్ వసీం(69), ఓపెనర్ అలీషాన్ షరాఫు(51) అర్ధసెంచరీలతో రాణించారు. వీరికి తోడు హర్షిత్ కౌశిక్(19), జొహైబ్(21) మెరుపు ఇన్నింగ్స్‌తో అలరించాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఒమన్‌కు అదిరే ఆరంభం లభించింది. యుఎఇ ఓపెనర్లు ఆలీషాన్ షరాఫు, మహ్మద్ వాసీం కలిసి తొలి వికెట్‌కు 88పరుగులు జతచేశారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు బ్యాటర్లు రాణించారు. ఆసిఫ్ ఖాన్(2), రాహుల్ చోప్రా(0) మాత్రమే నిరాశపరిచారు. ఒమన్ బౌలర్లలో జితిన్‌కు రెండు, హసన్, సమరుకు ఒక్కో వికెట్ దక్కాయి. భారీ ఛేదనలో ఒమన్ జట్టు 18.4ఓవర్లలో 130 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ జితేందర్(20), బిస్ట్(24), వినాయక్(20) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. యుఎఇ బౌలర్లు సిద్ధిఖ్‌కు నాలుగు, హైదర్ అలీ, మహ్మద్‌కు రెండేసి, రోహిత్ ఖాన్‌కు ఒక వికెట్ దక్కాయి. వరుసగా రెండో ఓటమితో గ్రూప్-లో ఒమన్ జట్టు సూపర్-4 నుంచి నిష్క్రమించగా..

పాకిస్తాన్-యుఎఇ జట్ల మధ్య జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు సూపర్-4 బెర్త్ దక్కనుంది.గ్రూప్-బిలో శ్రీలంకతో జరుగుతున్న రెండో లీగ్ మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన హాంకాంగ్ నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 149పరుగులు చేసింది. ఛేదనలో శ్రీలంక జట్టు 10ఓవర్లు ముగిసేసరికి 2వికెట్ల నష్టానికి 65పరుగులు చేసింది. నేడు బంగ్లాదేశ్-ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య పోటీ జరగనుంది.

# మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితం ఆదర్శం, స్ఫూర్తిదాయకం

**- ఇంజనీర్లు సమాజ నిర్మాతలు**
**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15:** భారతరత్న స్వర్గీయ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164 వ జయంతిని వేంపల్లి లో సోమవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ప్రపంచ ప్రఖ్యాత ఇంజనీర్ అని, బహుముఖ ప్రజ్ఞాశాలి అని, మహా మేధావి అని, మేధస్సులో బృహస్పతి వంటి వాడని కొనియాడారు. తిరుపతి తిరుమల ఘాట్ రోడ్ నిర్మాణంలో, మూసీ నది వరదల నుండి హైదరాబాదును రక్షించడంలో విశ్వేశ్వరయ్య పాత్ర ఉందని తులసి రెడ్డి అన్నారు.

విశ్వేశ్వరయ్య కర్ణాటక రాష్ట్ర నిర్మాతఅని, మైసూర్ వద్ద కృష్ణరాజ సాగర్ ఆనకట్ట నిర్మాణంలో, బృందావన్ గార్డెన్స్ ఏర్పాటులో, భద్రావతి ఉక్కు కర్మాగారం నిర్మాణంలో, మైసూర్ శాండల్ సోప్ తయారీలో,బ్యాంకఆఫ్ మైసూర్ ఏర్పాటులో విశ్వేశ్వరయ్య పాత్ర ఉందని తులసి రెడ్డి అన్నారు.

విశ్వేశ్వరయ్య జయంతి అయిన సెప్టెంబరు 15ను ఇంజనీర్ల దినో త్స వంగా జరుపు కోవడం హర్షనీయం,సమంజసం అన్నారు. విశ్వేశ్వరయ్య జీవితం అందరికీ ఆదర్శం అనుసరణీయం మార్గ దర్శకం స్ఫూర్తిదాయకం అని తులసి రెడ్డి కీర్తిం చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీయు తులు ఉత్తన్న, వెంకటేశు ,బద్రీనాథ్, వేమయ్య, రాఘ వయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలను

# ప్రైవేటీకరించడాన్ని తప్పుపట్టిన రాష్ట్రం

**- రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో ఏర్పాటు చేసిన 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కింది**
**- వాటిలో 5 కళాశాలలు ఇప్పటికే ప్రారంభమై 750 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించడం జరిగింది.**
**- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ భాషా**



**నాయుడుపేట –సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15:** రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో ఏర్పాటు చేసిన 17 మెడికల్ కళాశాలలు ప్రజలకు కనువిందు చేస్తున్నాయి. వాటిలో 5 కళాశాలలు ఇప్పటికే ప్రారంభమై 750 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించాయి. అంతేకాక 2024 ఎన్నికలకు ముందు విజయనగరం, పులివెందుల మెడికల్ కళాశాలలు కూడా ప్రారంభ మయ్యాయి. కానీ ఆ తర్వాత ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఈ రెండు కళాశాలలకు ఇండియన్ మెడికల్ కౌన్సిల్ కేటాయించిన 50 సీట్లు చొప్పున తిరస్కరించి, సీట్లను రద్దు చేయమని లేఖ రాయడం దురదృష్టకరం అని ఆయన తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందని ద్రాక్షపండులా చేస్తున్నది అని షేక్ సిరాజ్ భాష ఆగ్రహం వ్యక్తం చేశారు.“అమరావతిని గ్రాఫిక్స్‌తో చూపించినట్లే, ఈ కాలేజీలను కూడా కట్టని భవనాలుగా చూపిస్తున్నారా?” అని ఆయన ప్రశ్నించారు.

నిజానికి, ఈ కాలేజీలు కట్టబడినవే అని, ఒక్కసారి వెళ్లి చూసిన వారికే వాస్తవం అర్థమవుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే, “మా నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి. స్పష్టం చేసి నట్టుగా, రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలను ప్రైవేటీక రించడానికి ప్రయత్నిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తాము. మా నాయకుడికి అండగా మేమందరం నిలుస్తాం” అని షేక్ సిరాజ్ భాషా కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# తైక్వాండో కేవలం ఒక క్రీడ మాత్రమే కాదు

**- ఇది యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం పెంపొందించే సాధనం**
**- నెల్లూరు జిల్లా యూత్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉయ్యాల పవన్ కుమార్**
**150 మంది కి తైక్వాండో కలర్ బెల్ట్ పరీక్షలు - 30 మంది క్రీడాకారులు అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేశారు**



**నాయుడుపేట –సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15:** తైక్వాండో కేవలం ఒక క్రీడ మాత్రమే కాదు ఇది యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం పెంపొందించే సాధనం.నెల్లూరు జిల్లా యూత్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉయ్యాల పవన్ కుమార్ తెలియజేశారు.కొత్తూరు ఇందుకూరుపేట మండలంలోని జీవీకే చిన్మయ విద్యాలయాల్లో, యూత్ తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో, ఎస్‌పి ఎస్ఆర్ నెల్లూరు జిల్లా యూత్ తైక్వాండో అసోసియేషన్ వారు తైక్వాండో కలర్ బెల్ట్ పరీక్షను ఘనంగా నిర్వహించారు. ఈ పరీక్షల్లో నెల్లూరు పరిసర ప్రాంతాల నుండి సుమారు 150 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అందులో నాయుడుపేట నుండి 30 మంది క్రీడాకారులు అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించి పరీక్షలను విజయవంతంగా పూర్తిచేశారు. చిన్నారుల నుండి యువత వరకు విభిన్న వయస్సుల క్రీడాకారులు శక్తివంతమైన కిక్స్, పంచ్‌లు, క్రమశిక్షణతో కూడిన ప్రదర్శనలతో తల్లిదండ్రులు, ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.



ఈ సందర్భంగా ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా యూత్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉయ్యాల పవన్ కుమార్ మాట్లాడుతూ, “తైక్వాండో కేవలం ఒక క్రీడ మాత్రమే కాదుబీ ఇది యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం పెంపొందించే సాధనం. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల నుండి వచ్చిన ప్రతిభావంతులైన క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడం మాకు గర్వకారణం” అని పేర్కొన్నారు. ఆయన తల్లిదండ్రులు, కోచ్‌లు, నిర్వా హకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, సంఘ సభ్యులుగా ఏ. వినోద్ కుమార్, ఎస్.కె. అస్పాఫ్, విజయ్ ఆనంద్, నవీన్ కు మార్, ఆంజనేయులు, లక్ష్మీ ప్రభ,చంద్ర మోహన్ హాజరై క్రీడాకారులకు శు భాకాంక్షలు తెలిపారు. వారు ఈ తరహా కార్యక్రమాలు జిల్లాలో తైక్వాండో క్రీడాభివృద్ధికి, యువతలో ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తి పెంపొం దించేం దుకు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ పరీక్షలు స్థానికంగా తైక్వాండో క్రీడకు పెరుగుతున్న ఆదరణను ప్రతిబింబించాయి. నిర్వాహకులు భవిష్యత్తులో మరిన్ని శిక్షణా శిబిరాలు, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించే యోచనలో ఉన్నారని తెలిపారు.

# ఘనంగా హిందీ జాతీయ భాషా దినోత్సవం



**గుంతకల్–సూర్య వాస్తవం, సెప్టెంబర్15:** స్థానిక పిఎన్టి కాలనీలో గల శ్రీ చైతన్య పాఠశాల గుంతకల్లు –2 నందు హిందీ భాషా దినోత్సవాన్ని ఏ జి ఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న జాతీయ హిందీ భాషా దినోత్సవం జరుపుకుంటారన్నారు. వారు మాట్లాడుతూ జాతీయ భాష అయిన హిందీని ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. కోఆర్డినేటర్ నాగ భూషణం మాట్లాడుతూ దేశాన్ని చుట్టి రావాలంటే హిందీ భాషను అభ్యసించాలన్నారు. ప్రిన్సిపాల్ పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులు హిందీని చదవడం, రాయడం అభ్యాసం చేయాలని హిందీ గొప్పతనాన్ని వివరించారు. 1949 సెప్టెంబర్ 14న భారత రాజ్యాంగం లో హిందీ భాషను చేర్చారన్నారు. హిందీ ఉపాధ్యాయులు మాట్లాడుతూ హిందీలోని దోహాలు, నిబంధ్ జీవితానికి అవసరమైన విలువలను తెలియజేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులచే వివిధ కవుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఇందులో డీన్ మస్తాన్ రావు సి. ఇంచార్జ్ ఖాదర్ ప్రైమరీ ఇంచార్జ్ హేమావతి, సౌందర్య మరియు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విడపనకల్లు చెక్ పోస్ట్‌లో

# తనిఖీలు ముమ్మరం

**- అక్రమ మద్యం పై గట్టి నిఘా**
**- రాత్రింబవళ్లు ప్రొహిబిషన్ , ఎక్సైజ్ పోలీసుల విస్తృతంగా సోదాలు**





**విడపనకల్లు – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15:** అనంతపురం జిల్లాలో మాదక ద్రవ్యాలు, అక్రమ మద్యం సరఫరాను అరికట్టేందుకు ఉక్కుపాదం మోపాలని విడపనకల్లు చెక్ పోస్ట్‌లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు ముమ్మరం అయ్యాయి. విడపనకల్లులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద నిరంతరం వాహనాలను చెక్ చేస్తున్నారు.. కర్ణాటక నుంచి ఆంధ్రకు ఈ చెక్ పోస్ట్ ప్రధాన మార్గం కాబట్టి ఈ చెక్‌పోస్టుల వద్ద రాత్రింబవళ్లు ను అధికారులు విస్తృతంగా సోదాలు చేస్తున్నారు. సోమవారం నాడు ద్విచక్ర వాహనాలు, కార్లలోనూ సైతం వదలకుండా తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల, సీట్లను, బ్యాగులను పరిశీలించి వదులుతున్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా పెంచామని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నట్లు ప్రొహిబిషన్ , ఎక్సైజ్ పోలీసులు చెబుతున్నారు.

## చేయి చేయి కలిపి

# మిత్రుడికి ఆర్థిక సాయం





**పత్తికొండ టౌన్ –సూర్య వాస్తవం, సెప్టెంబర్ 15:** పత్తికొండ మండలం పత్తికొండ స్థానిక ఎస్సీ కాలనీలోని మదన్మోహన్ అనేట మిత్రుడు అనారోగ్య కారణాలు చేత మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న టువంటి 1995 96 మిత్రబృందం అందరూ కలిసి మిత్రుడికి చిరు సాయం చేయదలిచారు. మదన్మోహన్ కుటుంబానికి మిత్రులందరి తరుపున డాక్టర్ సుంకన్న ,ఆలంకొండ రామాంజనేయులు, యోగేష్, చందు నాయక్, మాట్లాడుతూ మా మిత్రుడు అనారోగ్యం చేత మరణించడం జరిగింది అందుకు గాను మా మిత్ర బృందం తరఫున 30 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. మిత్రుడు మదన్మోహన్ మరణించిన తరువాత ఇతనికి భార్య మరియు ఆడ పాపకు వారి చేయూత కొరకు తగిన సహాయం చేయగలుగుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిలాన్, బద్రి, రహీం భాష, సుంకన్న అల్తాఫ్, కేశవ, జాఫర్, రంగస్వామి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )